

నెల్లూరు : పరీక్ష రాసి కేంద్రం నుంచి వెలుపలకు వస్తున్న అభ్యర్థులు

తొలిరోజు ప్రశాంతం

8 కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

117 మంది అభ్యర్థుల గైర్హాజరు

నెల్లూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉమ్మడిజిల్లాలోని 8 కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా రెండు విడతల్లో పరీక్షలు జరిగాయి. జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్‌ఎడ్యుకేషన్, ఎస్‌జీటీ కలిపి 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు భర్తీ చేయనుండగా వీటికి 31,221 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నెల్లూరురూరల్‌లోని పొట్టేపాళెం ఐయాన్ డిజిటల్‌జోన్, కోవూరు మండలం గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, కావలిలోని పీబీఆర్ విశ్వోదయా ఇంజనీరింగ్ కళాశాల, రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, తిరుపతి జిల్లా విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, గూడూరు సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు జరగ్గా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు వైద్యశిబిరాలు, నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.


● తొలిరోజు 1,237 మంది హాజరు

డీఎస్సీ పరీక్షలకు సంబంధించి తొలిరోజు ఉదయం సెషన్‌లో 679 మందికి 616 మంది హాజరవగా 63 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 675 మందికి 621 మంది హాజరవగా 54 మంది గైర్హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి 1354 మంది హాజరు కావాల్సి ఉండగా 1237 మంది హాజరయ్యారు. 117 మంది గైర్హాజరయినట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. అలాగే విజువల్లీ హ్యాండీక్యాప్‌డ్, ఆర్థో హ్యాండీక్యాప్‌డ్‌లో రెండు చేతులు లేని వారికి స్క్రైబ్‌లను ఏర్పాటు చేశామని, దీనికోసంగా ఇంటర్ అర్హత కలిగిన వారిని సహాయకులుగా నియమించినట్లు చెప్పారు. కాగా, అభ్యర్థుల వెంట వారి కుటుంసభ్యులు కూడా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పరీక్షలు ఆరంభం నుంచి ముగింపు వరకు కళాశాలల వద్ద చెట్ల కిందే కూర్చున్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నెల్లూరులో మరో కరోనా కేసు

27 మంది అనుమానితులకు పరీక్షలు

7కు చేరిన పాజిటీవ్‌లు



నెల్లూరు (వైద్యం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో కొవిడ్ కేసు నమోదయ్యింది. గురువారం ఆరు పాజిటివ్‌లు గుర్తించగా, శుక్రవారం ఓ కేసు రికార్డుకెక్కింది. నెల్లూరులోని మూలాపేటకు చెందిన 22 ఏళ్ల యువకుడికి పరీక్షలు చేయగా కరోనా సోకినట్లు నిర్ధారణ అయింది. అయితే, కరోనా తీవ్రత తక్కువగా ఉండటంతో బాధితుడ్ని హోం ఐసోలేషన్‌లోనే ఉంచి చికిత్స అందిస్తున్నారు. కొవిడ్ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇదిలాఉంటే జిల్లాలో నమోదయిన 6 కరోనా కేసులకు సంబంధించి వారితో సన్నిహితంగా ఉన్న వారిని వైద్యాధికారులు గుర్తించి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 27 మందికి ఈ పరీక్షలు చేయగా, ఒకరికి కరోనా నిర్ధారణ అయింది.

9న విజన్ ప్లాన్ ప్రారంభం

నెల్లూరు (హరనాథపురం) : జిల్లా, నియోజకవర్గ విజన్ ప్లాన్ యూనిట్లను ఈ నెల 9వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గస్థాయి ప్రత్యేకాధికారి, స్థానిక ఎమ్మెల్యే, ఏడుగురు కమిటీ సభ్యులతో విజన్‌ప్లాన్ డాక్యుమెంటు తయారు చేసినట్లు చెప్పారు. 9న ఉదయం వర్చువల్‌గా సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా, నియోజకవర్గాలు, మండలాల్లోప్రారంభమైన పనుల జాబితా తయారు చేయాలని, మంజూరైన వాటికి శంకుస్థాపనలకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీటికి ఈ నెల 11న వీటికి శంకుస్థాపన జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా 12న అమరావతిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులతో ట్రెయిన్ స్టార్మింగ్ సెషన్ జరుగుతుందని చెప్పారు.

● ఎక్సైజ్ డీసీగా శంకరయ్య

నెల్లూరు (క్రైం) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా ఎం శంకరయ్య శుక్రవారం బాధ్యతలు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై నెల్లూరుకు వచ్చారు. ఈ సందర్భంగా శంకరయ్యను ఎక్సైజ్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ పి దయాసాగర్, జిల్లా డీపీఈవో శ్రీనివాసులు నాయుడు, ఏఈఎస్ రమేష్, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



నెల్లూరులోని బారా షహీద్ దర్గా ప్రాంగణంలో సామూహిక ప్రార్థనల కోసం చేసిన ఏర్పాట్లు

నేడు బక్రీద్

సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు

ముస్లింలు బక్రీదు పండుగను శనివారం జిల్లా వ్యాప్తంగా జరుపుకోనున్నారు. ఇందుకోసం ప్రభుత్వపరంగా ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. దైవ మార్గంలో పయనిస్తున్నప్పుడు మనకు ప్రీతిపాత్రమైన వాటిని త్యాగం (బుర్బానీ) చేసే విషయంలో ముస్లింలు ప్రవక్త హజరత్ ఇబ్రహీం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటారు. ఆయన త్యాగానికి ప్రతీకగా బక్రీదు పండుగను జరుపుకుంటారు.

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా, బుజబుజ నెల్లూరు, మహాత్మాగాంధీనగర్, సంతపేట, నవాబుపేట, జాకీర్‌హుస్సేన్ నగర్, బర్మాషెల్‌గుంట తదితర ప్రాంతాల్లోని ఈద్గాలలో సామూహిక ప్రార్థనలకు నగర పాలక సంస్థ మౌలిక సదుపాయాలు కల్పించింది. అన్నీ ఈద్గాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నెల్లూరులోని మసీదులు, ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయని ముస్లిం పెద్దలు తెలియజేశారు. బక్రీదు పండుగకు అవసరమైన సామగ్రి కొనుగోళ్ల కోసం ముస్లింలు తరలిరావడంతో బజార్లు కళకళలాడాయి. కాగా, బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ వేర్వేరు ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం.. ఈ రెండూ బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించండి : ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముస్లింలు, పోలీస్ శాఖలోని ముస్లింలు, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ జీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి, భక్తికి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని అందరూ సుఖశాంతులతో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే ప్రజలు వెంటనే స్థానిక పోలీసులకుగానీ, డయల్ 112కుగానీ సమాచారమివ్వాలని కోరారు.



చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతున్న గంగోటి నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే కురుగొండ్ల, మెట్టుకూరు తదితరులు

లాభాల బాటలో ఎన్డీసీఎంఎస్‌ను నడుపుతాం

● బాధ్యతల స్వీకరణలో చైర్మన్ నాగేశ్వరరావు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్‌ను (ఎన్డీసీఎంఎస్) లాభాల బాటలో నడుపుతామని ఆ సంస్థ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని ఎన్‌డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించి, మాట్లాడారు. డీసీఎంఎస్ ద్వారా జిల్లా రైతాంగానికి ఇతోధికంగా సేవలందిస్తామని చెప్పారు. డీసీఎంఎస్ లాభాల బాట పట్టేందుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాగేశ్వరరావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, కన్నబాబు, ఎన్డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీసీసీబీ చైర్మన్‌గా..

నెల్లూరు (హరనాథపురం) : తమ బ్యాంకు వాటా మూలధనంపై ఖాతాదారులకు, రైతులకు డివిడెంట్ ఇచ్చేందుకు కృషి చేస్తామని కేంద్ర సహకార బ్యాంకు (ఎన్డీసీసీబీ) చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. శుక్రవారం ననగరంలోని ఎన్డీసీసీబీ కార్యాలయంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. బ్యాంకును లాభాల బాటలో నడుపుతామని, రైతులకు ఇతోధికంగా రుణాలు అందించడానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయుల్లో గందరగోళం

- సీనియారిటీ జాబితాల్లో పొరపాట్లు
- విద్యాశాఖ అధికారుల తీరుపై టీచర్ల ఆందోళన

నెల్లూరు (విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీల్లో గందరగోళం నెలకొంటోంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు 111 మంది స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా నియమించారు. మిగిలిన స్కూల్ అసిస్టెంట్స్ విభాగంలో ఇంగ్లీష్ 418, హిందీ 270, తెలుగు 400, ఉర్దూ 7, నోసబ్జెక్ట్ 1 మొత్తం 1096 మంది, స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజెస్ విభాగంలో బయలాజికల్ సైన్స్ 321, మ్యాథ్స్ 566, ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ) 141, ఫిజికల్ సైన్స్ 381, సోషల్ 327, స్పెషల్ ఎడ్యుకేషన్ 12 కలిపి 1748 మందికి సంబంధించిన సీనియారిటీ జాబితాలను విడుదల చేశారు. వీరికి ఒక్కరోజు మాత్రమే అవకాశం కల్పించడంతో ఆప్షన్‌లను ఇచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. వెలువడిన జాబితాలో కూడా సీనియారిటీ, ఖాళీలు పొరపాట్లు పడ్డాయి. వీటన్నింటిపై అభ్యంతరాలు తెలపగా, కొన్నింటిని పరిష్కరించి మిగిలిన వాటిని అలాగే వదిలేశారు. దీంతో తుది జాబితాలో పూర్తిగా పొరపాట్లు దొర్లి తమకు అన్యాయం జరిగిందంటూ ఎస్‌ఏలు ఆందోళన చేస్తున్నారు. కొంత మంది అర్హత లేకపోయినా పాయింట్లు పొందేలా పావులు కదిపి తమకు అన్యాయం చేశారంటూ ఆరోపిస్తున్నారు.

● స్కూల్ అసిస్టెంట్లకు స్థానచలనం

జిల్లాలో బదిలీకి దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)కు ఉత్తర్వులు విడుదలయ్యాయి. తొలుత ఎస్‌ఏ నాన్ లాంగ్వేజెస్

- మిగతా 7లో..



డీఈవో కార్యాలయంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు





'నెల్లూరు కాకపోతే ఆ పక్క మండలం.. అక్కడా కాకపోతే ఈ పక్క మండలానికి వెళతాం తప్ప.. ఎక్కడో దూర ప్రాంతాలకు వెళ్లమంటే మా వల్ల కాదు సార్.. ఇదుగోండి.. మా ఎమ్మెల్యే సిఫారసు లేఖ కూడా ఇచ్చారు.'

\- రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగుల తీరిది.

అక్కడ లేదా ఇక్కడ

- అనుకూల ప్రాంతాల కోసం రెవెన్యూలో పోటీ
- నెల్లూరు పరిసర ప్రాంతాల వైపే మొగ్గు
- గతంలో చేసిన స్థానాలకు మళ్లీ ప్రయత్నాలు
- సిఫారసుల కోసం ఎమ్మెల్యేల వద్దకు క్యూ
- పాతుకుపోయిన ఆర్‌ఐలు.. కొత్తవారికి నో ఛాన్స్
- కలెక్టరేట్ వైపు చూసేందుకూ విముఖత

నెల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖలో కొందరు ఉద్యోగుల తీరు భిన్నంగా ఉంటోంది. నెల్లూరు దాటి దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ససేమిరా అంటున్నారు. ప్రస్తుతం సాధారణ బదిలీలు జరుగుతుండటంతో ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు, గత బదిలీల్లో నచ్చని స్థానాలకు బదిలీ అయిన ఉద్యోగులు.. ఇప్పుడు మళ్లీ వారికి అనుకూలమైన చోటు కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు తమకున్న రాజకీయ, ఆర్థిక బలాలను ఉపయోగిస్తూ జిల్లా ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. కొందరైతే ఆయా ఎమ్మెల్యేల వద్ద సిఫార్సు లేఖలు కూడా పొందడం గమనార్హం. ఇంకొందరు తమ స్థానాన్ని కదపకుండా ఉండేందుకు ఎమ్మెల్యేల ద్వారా ఉన్నతాధికారులకు చెప్పించుకుంటున్నారు. వీరి మూలంగా సామాన్య ఉద్యోగులు నష్టపోతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో బదిలీలు ఎంత మేరకు పారదర్శకంగా జరుగుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

● ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

సాధారణ బదిలీకు ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ వరకూ గడువు పొడగించినా రెవెన్యూ శాఖలో ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. వీఆర్వో స్థాయి నుంచి తహసీల్దార్ స్థాయి వరకూ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. గతేడాది సెప్టెంబరులో జరిగిన బదిలీల్లో బదిలీ అయిన వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కలెక్టరేట్‌లో జరుగుతోంది. కొంతమంది వీఆర్వోలు, ఆర్‌ఐలు, డిప్యూటీ తహసీల్దార్లు తమకు అనుకూలమైన పోస్టుల కోసం తీవ్రంగా పైరవీలు చేస్తున్నారు. వీరిలో చాలా మంది గతంలో పనిచేసిన మండలాలకే వెళ్లేందుకు సిఫార్సు లేఖలతో ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. నెల్లూరు పరిసర ప్రాంతాల్లో హెచ్‌ఆర్‌ఏ ఎక్కువగా వస్తుండటం, ఇక్కడ వారికి ఇళ్లకు దగ్గరగా ఉండడంతో నెల్లూరు డివిజన్ దాటి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇలా ఒకే ప్రాంతంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగుల మూలంగానే రెవెన్యూ వివాదాలు పెరుగుతున్నట్లు ఆ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

● ఆర్‌ఐలకు స్థానచలనం కలిగేనా?

కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు అయితే అనేక ఏళ్లుగా ఫీల్డ్‌లోనే పనిచేస్తున్నారు. కొత్త వారికి అవకాశం కల్పించడం లేదు. సాధారణంగా రెండేళ్లు ఒక మండలంలో ఆర్‌ఐగా పనిచేశాక ఆ ఉద్యోగిని తర్వాత ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ స్థానానికి మార్చి కొత్తగా ఉద్యోగోన్నతి పొంది వచ్చిన ఆర్‌ఐలకు ఫీల్డ్ వర్కులు అప్పగిస్తుంటారు. కానీ కొన్నేళ్లుగా ఈ పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. దీనిపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు కూడా దృష్టి పెట్టారు. ఈదఫా ఏళ్ల తరబడి ఫీల్డ్‌లోనే పనిచేస్తున్న ఆర్‌ఐలకు స్థానచలనం తప్పదని, వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. అయితే కొందరు ఆర్‌ఐలు తమ పలుకుబడి ఉపయోగిస్తూ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మరి చివరకు ఉన్నతాధికారులు ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. అదే సమయంలో కలెక్టరేట్ అంటేనే ఉద్యోగులు విముఖత చూపుతున్నారు. ఇక్కడ పనిచేసేందుకు మాత్రం దరఖాస్తు చేసుకోవడం లేదు. ఇక్కడ రూల్ ప్రకారం కచ్చితంగా పనిచేయాల్సి ఉండడం, మండలాల్లో మాదిరి ఎప్పుడు పడితే అప్పుడు వచ్చి వెళ్లేందుకు వీలు లేకపోవడంతోనే ఉద్యోగులు కలెక్టరేట్‌లో పనిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు.



ఆత్మకూరు మండలం అప్పారావు పాలెం స్టాక్‌యార్డులో నిల్వ చేసిన ఇసుక

ఎందుకింత నిర్లక్ష్యం?

ఇసుక కావాలంటే డీసిల్టేషన్ పాయింట్లే దిక్కు

ఫలితంగా పెన్నాలోకి విరుద్ధంగా దిగుతున్న ట్రాక్టర్లు

ఇసుక యార్డులు తెరవడంలో తీవ్ర జాప్యం ● వారం రోజులుగా ఆగిన తవ్వకాలు

నెల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఇసుక నిల్వలు అందుబాటులో ఉన్నా ఆ ఇసుకను వినియోగదారులకు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. వారం రోజుల నుంచి పెన్నా నదిలో ఇసుక తవ్వకాలు నిలిపేసినప్పటికీ ప్రత్యామ్నాయంగా స్టాక్‌యార్డుల్లోని ఇసుకను అందుబాటులోకి తీసుకురావడంలో జాప్యం జరుగుతోంది. అధికారుల తీరుతో ఇసుక ధర పెరుగుతుండగా, అది వినియోగదారులపై పడుతోంది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం మాన్ సూన్ సీజన్‌లో నదుల్లో తవ్వకాలు జరపకూడదు. ఈ నెల 1 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకూ పెన్నాలో ఇసుక తవ్వకాలు నిలిచిపోతాయి. ఈ మేరకు కలెక్టర్ కూడా ప్రకటన విడుదల చేశారు. అయితే తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశించిన జిల్లా అధికారులు.. ప్రత్యామ్నాయ మార్గాలను చూపించడంలో మాత్రం విఫలమవుతున్నారు.

● యార్డుల్లో మొదలుకాని విక్రయాలు

జిల్లాలో 9 ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతూ ఉండగా, వాటిలో నాలుగు రీచ్‌లు డీసిల్టేషన్‌వి కాగా మరో ఐదు సెమీ మెకనైజ్డ్ రీచ్‌లు ఉన్నాయి. వీటిలో పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం-1, సూరాయపాలెం-2 డీసిల్టేషన్ పాయింట్లలో మాత్రమే ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. మిగిలిన అన్ని ఓపెన్ రీచ్‌లలో తవ్వకాలు నిలిపేశారు. వీటన్నింటి చోట స్టాక్‌యార్డులు ఏర్పాటు చేసి ఉన్నారు. ఇంతకముందే అక్కడ ఇసుకను నిల్వ చేశారు. మొత్తంగా జిల్లాలోని తొమ్మిది స్టాక్‌యార్డులలో 2.34 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. వీటిలో పోతిరెడ్డిపాలెం, సంగం, సూరాయపాలెం-1, సూరాయపాలెం-2 స్టాక్‌యార్డుల వద్ద మాత్రమే మొదటి నుంచీ ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. మిగిలిన ఐదు స్టాక్‌యార్డులలో అమ్మకాలు మొదలుకాలేదు. ఇక్కడి నిర్వాహక ఏజన్సీలకు అనుమతులు ఇవ్వలేదని చెప్పుకుంటున్నారు. దీంతో వినియోగదారులకు ఇసుక కావాలంటే డీసిల్టేషన్ పాయింట్ల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఫలితంగా రవాణా చార్జీలు పెరుగుతున్నాయి. ఈ భారం వినియోగదారులపై పడుతోంది. ఈ వారం రోజుల్లోనే టిప్పర్ ఇసుక ధర రూ.2 వేల వరకూ పెరిగినట్లు వినియోగదారులు చెబుతుండడం గమనార్హం. అదే సమయంలో ట్రాక్టర్లు కూడా దూరాన ఉన్న డీసిల్టేషన్ పాయింట్లకు వెళ్లలేక సమీపంలోని పెన్నా నదిలోనే నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వి తీసుకెళుతున్నారు.

జిల్లాలో ఇసుక నిల్వలు

స్టాక్ యార్డు	ఇసుక నిల్వలు (మెట్రిక్ టన్నులు)	విక్రయించాల్సిన ధర (రూ.లలో)
పోతిరెడ్డిపాలెం	40,550	250
సంగం	96,468	250
సూరాయపాలెం-1	46,165	250
సూరాయపాలెం-2	15,817	250
కందుకూరు భీమవరం	2000	184
పల్లిపాడు	5850	82
అప్పారావుపాలెం	15000	108
మినగల్లు	7200	93
విరువూరు	5000	93

మైనింగ్ అధికారులను ఆదేశిస్తాం

మాన్‌సూన్ సీజన్‌లో నదుల్లో ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీల్లేదు. నిర్దేశించిన స్టాక్ యార్డుల నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఎక్కడ ఎంత ధరకు విక్రయించాలన్నది గతంలోనే ఫైనలైజ్ చేశాం. స్టాక్‌యార్డుల్లో ఎందుకు విక్రయాలు చేయడం లేదన్నది పరిశీలిస్తాం. వెంటనే విక్రయాలు మొదలుపెట్టేలా మైనింగ్ అధికారులను ఆదేశిస్తాం.

- కే కార్తీక్, ఇన్‌చార్జ్ కలెక్టర్

వైభవంగా కామాక్షితాయికి పల్లకి సేవ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కామాక్షితాయికి పల్లకి సేవలు వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన జరిగింది. ఉదయం ఆలయంలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున్వామికి నిత్య కల్యాణోత్సవం భక్తులను అలరించింది. మహిళా భక్తులు ఆలయం చుట్టూ రాహుకాల దీపారాధనలు వెలిగించి పూజలు నిర్వహించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9360
వెండి కిలో ధర	రూ. 108400
వెండి ఒక గ్రాము	రూ. 111.50

కొవిడ్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలి



వెంకటాచలం: కొవిడ్‌పై అధికారులతో సమీక్షిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన

వెంకటాచలం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలు కొవిడ్ వైరస్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, పంచాయతీ, రెవెన్యూ అధికారులు సమిష్టిగా కలిసి పర్యవేక్షించాలన్నారు. కొవిడ్ వైరస్ లక్షణాలు ఉన్నవారిని వెంటనే గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ డీవో కల్పన, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మాస్కులు ధరించాలి

కొవిడ్ బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు మాస్కులు ధరించడం చాలా మంచిదని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, 5 ఏళ్లలోపు పిల్లలు, గర్భిణులు అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలన్నారు. తరచుగా చేతులు కడుక్కోవడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేయి అడ్డు పెట్టుకోవడం, ముఖాన్ని తాకకుండా ఉండడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. రద్దీ ప్రాంతాల్లోకి వెళ్లకూడదన్నారు. జ్వరం, దగ్గు, అలసట, గొంతు నొప్పి, రుచి, వాసన కోల్పోవడం, తలనొప్పి, శరీర నొప్పులు, ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే కొవిడ్ పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. సకాలంలో చికిత్స పొందటానికి సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సూచనలు పాటించాలని ప్రజలకు సూచించారు.

● **మనుబోలు :** కొవిడ్ ఇప్పుడిప్పుడే వ్యాప్తి చెందుతోందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్లకు పైబడిన వారు, ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణులు ఇళ్లలోనే ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలి. రద్దీగా ఉండే ప్రదేశాలలో ప్రజలు మాస్కులు ధరించాలన్నారు. కోవిడ్ లక్షణాలతో బాధపడే వారు సమీపంలోని ఆరోగ్యకేంద్రానికి వెళ్లాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శానిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

న్యూస్ బాక్స్

వాహనాల తనిఖీ



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకట రాజేష్

రాపూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలాజీ కాంప్లెక్స్ నాలుగు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం స్థానిక ఎస్ఐ వెంకటరాజేష్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సరైన పత్రాలు లేని వాహనాలను, నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై నడిపిస్తున్న వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



తల్లులకు, బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

మనుబోలు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని పిడూరు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసంపై తల్లులు, కిశోరి బాలికలతో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లకు 18, మగపిల్లవాడికి 21 సంవత్సరాలు వచ్చే వరకు వివాహాలు చేయవద్దన్నారు. కిశోరి బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్ మహాలక్ష్మి, జే కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న ఈ-స్టాంపుల కొరత

ఆత్మకూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈ-స్టాంపు కాగితాల కొరత కారణంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులనే ఈ-స్టాంపింగ్ విధానం ప్రవేశపెట్టారు. ఈ-స్టాంపింగ్ కాగితాల సరఫరా, ముద్రణ స్టార్ హోల్డింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. త్వరలో స్టాక్ హోల్డింగ్ కార్పొ రేషన్‌తో కుదిరిన ఒప్పంద కాలం ముగియ నున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆ సంస్థ వారు స్టాంపింగ్ కాగితాల సరఫరా నిలిపి వేశారు. కొన్ని ఏజన్సీల వారు కాగితాలు ఉన్నా లేవని సమాధానం చెబుతున్నారు. స్టాంపు డ్యూటీ తమ దగ్గర చెల్లిస్తేనే కాగితాలు ఇస్తామని చెబుతుండడం గమనార్హం. రూ.10, రూ.20, రూ.50ల స్టాంపుల కొరత వెంటా డుతూనే ఉంది. ఈనేపథ్యంలో ఈ-స్టాంపింగ్ కాగితాల అమ్మకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న స్టాంపులను సైతం కొందరు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈవిషయమై ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ తాళ్లూరి శ్రీనివాసచౌదరిని వివరణ కోరగా స్టాంపుల కొరత ఉన్నమాట వాస్తవమేనన్నారు. రూ.100 స్టాంపులు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 40.980 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 345 క్యూసెక్కులు వస్తుండగా పెన్నా డెల్టాకు 3,250, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

రూ.3.26 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణం

కలువాయి, జూన్ 6 (ఆం ధ్రజ్యోతి): మండలంలో ఉ పాధిహామీ పథకం కింద రూ. 3.26 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తయినట్లు పంచాయతీరాజ్ ఏఈ శివారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యా లయంలో శుక్రవారం ఎంపీ పీ ఆర్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల పరిధిలో జరుగు తున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. జడ్పీటీసీ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తరచూ రావడం లేదని, ఇక మీదట అందరూ హాజరై ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.

గ్రంథాలయాలతో విలువలు, విజ్ఞానం



పలు పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి అవసరమైన విలువలు, విజ్ఞానం, వికాసం, నైపుణ్యాన్ని అందించేవి గ్రంథాలయాలని బుచ్చిరెడ్డిపాళెం మం డల విద్యాశాఖ అధికారి-2 పాతపాటి వెంకటరత్నం అన్నారు. శుక్రవారం బుచ్చిలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు, పత్రికలు చదివే వారికి వివిధ రకాల అంశాలపై అవగాహన, సృజనాత్మకత, వ్యక్తిత్వ వికా సం వంటివి అలవడతాయన్నారు. వేసవి శిబిరం ముగింపు సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, విద్యాసామగ్రి అందజేశారు. ఇక్కడ గ్రంథాలయ అధికారిగా పని చేసి బదిలీపై వెళ్తున్న మంజులత, గ్రంథాలయానికి మౌలిక సదు పాయాలు కల్పించిన విశ్రాంత గ్రంథాలయాధికారి భూపతి సత్యనారాయణ సేవలను కొనియాడారు. నూతన అధికారి నరసింహారావుకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రత్న పురస్కార గ్రహీత గండికోట సుధీర్ కుమార్, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, యోగా మాస్టర్ పచ్చారి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు నిలువుటద్దం ప్రసన్న : చెముకుల

విడవలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్వలాభాల కోసం పార్టీలు మారుతూ నమ్ముకున్న ప్రజలను, కార్యకర్తలు నిలువునా మోసం చేసే కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వెన్నుపోటుకి నిలుటద్దమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య ఒ ప్రకటనలో విమర్శిం చారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులను విమర్శించే నైతిక విలువ ప్రసన్నకి లేదని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులను ఎంత ఖర్చుచేసి కొనుగోలు చేశారో ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎంయూఏ చేపట్టిన నిరసన కార్యక్రమం నాల్గోరోజైన శుక్రవారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సిక్ లీవ్‌లకు జీతాలు ఇవ్వాలని, కార్మికులపై పక్షపాత వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, శంకర్, సలాం, శివ, శ్రీను, రాములు, కాశిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

'భలే జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు షేక్ ఫయాజ్ రచించిన భలే జ్ఞాపకాలు పుస్తకాన్ని శుక్రవారం స్థానిక చైతన్య ఐటీఐ కళాశాల ఆవరణలో రచయిత ఫయాజ్‌తో కలిసి డాక్టర్ వేణుగోపాల్, స్థానికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఫయాజ్ రచించిన భలే జ్ఞాపకాల పుస్తకంలో ఎన్నో మంచి విషయాలు ఉన్నాయన్నారు. అనం తరం రచయిత ఫయాజ్ పుస్తక ఆవిష్క రణకు గల కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అహ్మద్‌బాషా, ఖాదర్‌బాషా, షేక్ఎండీ ఖాజా, దస్తగిరి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో రేషన్ దుకాణాలు



రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


తోటపల్లిగూడూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత పేదలకు అందుబాటులో పాత పద్ధతిలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసినట్లు టీడీపీ సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో షాప్ నెంబరు 13 నూతన చౌకధరల దుకాణాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వినియోగదారులకు వీలుగా ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఆదివారాలతో సహా రేషన్ సరుకులు అందించడం జరుగుతుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు మూడు రోజులు మాత్రమే ఇచ్చేవారని, దీంతో కూలీపనులు చేసుకునే వారు రేషన్ అందక చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాలు ఏర్పాటు చేసిందన్నారు. అంతేగాక పంచాయతీ భవనానికి, కొత్తపాలెం దళిత శ్మశాన వాటికకు వెళ్లే దారికి త్వరలో పనులు పూర్తిచేసి ఎమ్మెల్యే సోమిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు కొణతం రఘుబాబు, సర్పంచ్ చేవూరు శ్రీనివాసులు రెడ్డి, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, వీరబోయిన గంగాధర్, మన్యం జితేంద్రగౌడ్, మన్యం మధుగౌడ్, చింతా సీతారామయ్య, రేషన్ డీలర్ శ్రీరామ్, నందిని, వినియోగదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు



ముస్తాబవుతున్న కోటేశ్వరస్వామి ఆలయం

సంగం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న కోటేశ్వరాలయంలో శనివా రం నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కా ర్య నిర్వాహణాధికారి రఘురామయ్య తెలిపారు. అందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాల్లో గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి రోజుకో వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. 7వ తేదీ రాత్రి అంకురార్పణతో ఉత్స వాలు ప్రారంభమవుతాయి. 8వ తేదీన ధ్వజారోహణం, చిలక వాహనం, 9న రావణసేవ, 10న గిన్నెభిక్ష, నందిసేవ, 11న అంబారిసేవ, 12న కల్యాణోత్సవం, తీర్థవాది, పురుషామృగ వాహనసేవ, 13న ధ్వజ అవరోహణ, అలకల తోపు, అశ్వ వాహనము, 14న శేష వాహనం, 15న ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి రఘురామయ్య తెలిపారు.



రేపటి నుంచి అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచా యతీలో ఉన్న అడవిపేరంటాలమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్ర వారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం గడ్డంవారిపల్లి నుంచి నిలుపు కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సోమవారం కొట్టా లపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీ, గన్నేపల్లి, మంగళవారం మిట పల్లి, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, పేరంటాలమ్మనగర్ గ్రామాల్లో గ్రామో త్సవం జరుగుతుంది. బుధవారం పసుపుకుంకుమ బండ్లు, సాంస్కృతిక కార్య క్రమాలు, బాణసంచా వేడుకలు, గురువారం బండ్లపొంగళ్లు, ఎడ్ల బండ లాగుడు పోటీలు, విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలతో ఉత్స వాలు ముగుస్తాయన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు అన్నదాన కార్య క్రమం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

రైతుసేవా కేంద్రాల్లో అలంకారప్రాయంగా కుయోస్క్‌లు

● **వైసీపీ పాలనలో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా**



నిరుపయోగంగా పడిఉన్న ఇర్లపాడులోని కుయోస్క్ యంత్రం, ఎల్ఈడీ టీవీ

మర్రిపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందిస్తాంటూ గత వైసీపీ ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి ఆర్భాటంగా రైతుభరోసా కేంద్రాలకు సరఫరాచేసిన కుయోస్క్‌లు, ఎల్ఈడీ టీవీలు నిరుపయోగంగా మారాయి. సిబ్బంది ఫోన్‌లోనే యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవడంతో కుయోస్క్‌లు వాడక మూలకు చేరాయి. గత వైకాపా ప్రభుత్వం 2020లో అన్ని రైతుభరోసా కేంద్రాలకు (ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలు)లో కుయోస్క్ యంత్రాలు ఏర్పాటుచేసింది. ఆత్మకూరు నియోజకవర్గంలో 85 కేంద్రాల్లో కుయోస్క్‌లు ఉన్నాయి. అదేవిధంగా మర్రిపాడు మండలంలో ఉన్న 17 కేంద్రాలలోనూ ఏర్పాటుచేశారు. క్రమేణా ఒక్కొక్కటిగా మూలకు చేరాయి. ఒక్కో యంత్రానికి సుమారు రూ.80వేలు ఖర్చు చేశారు. రైతులు స్వయంగా కేంద్రా నికి వెళ్లి అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, పశుగ్రాసాలు అవసరమైన పరిమాణంలో కుయోస్క్‌ల ద్వారా నమోదు చేసుకొని నగదు చెల్లిస్తే 48 గంటల్లో అందిస్తామని ప్రకటించారు. ఆచరణలో సక్రమంగా అమలు చేయకపోవటంతో యంత్రాలు మూలన పడ్డాయి. ఈ యంత్రం పనిచేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. గత ప్రభుత్వం కల్పించలేదు. దీంతో సిబ్బంది సొంత నిధులతో ఆ సదుపాయం ఏర్పాటు చేసుకొని సేవలందించారు. కొంతకాలంగా కుయోస్క్‌ల బ్యాటరీలు పనిచేకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. ఎలాంటి ఆలోచన లేకుండా గత పాలకులు, ఉన్నతాధికారులు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధాచేశారని రైతులు, ప్రజలు విమర్శిస్తున్నారు.

రైతులకు సేవలందిస్తున్నాం

కాగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది తమ మొబైల్ ఫోన్‌లో యాప్‌ల ద్వారా అవసరమైన సేవలందిస్తున్నారు. మర్రిపాడు మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో కుయోస్క్‌లన్నింటినీ వినియోగంలోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి రామ్మోహన్ తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మహిళకు తీవ్ర గాయాలు



గాయపడ్డ మహిళను వైద్యశాలకు తరలిస్తున్న పోలీసులు



ప్రమాదానికి కారణమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ మహిళ కాలుజారి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మీద పడడంతో తీవ్ర గాయాలకు గురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ పట్టణంలోని పలు నివాసాల్లో పాచిపని చేసి సాయంత్రానికి స్వగ్రామానికి చేరుకుంటుంది. ఈనేపథ్యంలో శుక్రవారం సైతం ఓ నివాసంలో పనిచేసి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆనకట్ట మీదుగా నడుచుకుంటూ బస్టాండ్‌కు వెళుతోంది. ఈక్రమంలో గుంతలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వచ్చేసరికి కాలుజారి దానిపై పడింది. దీంతో మంటలు చెలరేగడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని నరసమ్మను బయటకు తీసి చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. నరసమ్మ కుమార్తె శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే : ప్రజల ఆగ్రహం

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్ట సుందరీకరణ పనుల్లో భాగంగా కట్ట ఏర్పాటు చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ దిగువకు చేరింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని, మార్చాలని పలుమార్లు పట్టణ ప్రజలు విద్యుత్ శాఖాధికారులు, సిబ్బందికి సూచించినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించలేదని సాకులు చెపుతూ కాలయాపన చేస్తూ వచ్చారన్నారు. మూగజీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయని, త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని ప్రతిరోజు ఆనకట్టపై వాకింగ్ చేసే వారు సైతం సోషల్ మీడియా వేదికగా సూచించినా విద్యుత్ శాఖాధికారులు పెడచెవిన పెట్టడంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి హైవేపై యువకుడి దుర్మరణం

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సుందరయ్య కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని ఇస్కాన్ సిటీకి చెందిన చెంచయ్య(28) బైక్‌పై గురువారం అర్ధరాత్రి బుజబుజ నెల్లూరులో స్నేహితుడిని వదిలిపెట్టి జాతీయ రహదారి మీదుగా ఇంటికి బయలుదేరాడు. సుందరయ్య కాలనీ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సౌత్‌ట్రాఫిక్ ఎస్ఐ మాల్యాద్రి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలిం చారు. చెంచయ్య అన్న రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు చోరీ

సంగం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బ గ్రామంలో పొలం పక్కన గ్రావెల్ రోడ్డులో ఒంటరిగా ఉన్న మహిళ కళ్లల్లో కారం కొట్టి మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలక్ష్మమ్మ అనే మహిళ తన పొలంలో కలుపు తీయించింది. కూలీలు వెళ్లిపోగా ఒక్కటే పొలం పక్కనే ఉన్న గ్రావెల్ రోడ్డుపై కూర్చొంది. ఈక్రమంలో గుర్తుతెలియని యువకుడు వెనుకనే వచ్చి ఆమె కళ్లలో కారం కొట్టి మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు సంగం పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

● **31 బైకుల స్వాధీనం**



అనుమానితుల వేలిముద్రలు పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న బుజ్జమ్మ రేవు ప్రాంతంలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. స్పెషల్ పార్టీలతో కలిసి నగర డీఎస్పీ సింధు ప్రియ, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు, ఎస్ఐలు, సుమారు 50 మంది పోలీసులు కలిసి 500 ఇళ్ళు తనిఖీ చేశారు. అనుమానితుల వేలిముద్రలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 31 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు ఆకతాయిలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్డన్ సెర్చ్‌కు ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు. దొంగతనాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నామని చెప్పారు.

యువకుడి నిజాయితీకి పోలీసు సత్కారం



యువకుడిని సన్మానిస్తున్న ఎస్ఐ

పొదలకూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి నిజాయితీని గుర్తించిన పోలీసులు శుక్రవారం అతడిని సత్కరించారు. వివరాలిలా ఉన్నాయి.. గత బుధవారం స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో మోటారుబైక్ కవర్‌లో ఉంచిన రూ.86వేల నగదు చోరీకి గురైంది. దీంతో బాధితుడైన పొదలకూరు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈనేపథ్యంలో పట్టణానికి చెందిన సురేష్ అనే యువకుడు శుక్రవారం తన ఇంటి సమీపంలోని చెత్తకుప్పలో నగదు ఉన్న కవరు దొరికిందని పోలీసులకు అప్పగించాడు. కవర్‌లో రూ.86వేల నగదుతో పాటు బ్యాంకు పాస్ పుస్తకం, పాన్‌కార్డులు ఉన్నాయి. దొరికిన సొమ్మును నిజాయితీగా పోలీసులకు అప్పగించిన యువకుడిని స్థానిక ఎస్ఐ షేక్ మహమ్మద్ హనీఫ్ సత్కరించారు. అలాగే వెయ్యి రూపాయలు యువకుడికి అందజేశారు.

ఆంధ్రజ్యోతి
నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 535



నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

● మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు

నెల్లూరు (వైద్యం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు ప్రతి నివాసంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని మలేరియా నివారణ విభాగం జిల్లా సహాయ అధికారి నాగార్జునరావు ప్రజలకు సూచించారు. శుక్రవారం కోటమిట్ట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని నివాసాల్లో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నీటి నిల్వలు గుర్తించి వాటిని పారబోయించారు. దోమల వల్ల కలిగే వ్యాధుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్‌యూవో శాంసన్‌బాబు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

బీపీఎస్ ఎప్పుడొస్తుందో?

● ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఎదురుచూపులు
● క్రమబద్ధీకరణపై వేల కుటుంబాల ఆశలు
● పురపాలక శాఖలో ఆరేళ్లుగా కదలని దస్త్రం
● నెల్లూరులో వంద కోట్ల ఆదాయం వచ్చే అవకాశం



నెల్లూరు (సిటీ), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు అతిక్రమించి నిర్మించిన వందల భవనాలు బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం) ద్వారా క్రమబద్ధీకరణకు ఎదురుచూస్తున్నాయి. అనధికార లేఅవుట్లలోని ప్లాట్లు అపరాధ రుసుము చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) ద్వారా క్రమబద్ధీకరణకు నిరీక్షిస్తున్నాయి. ఈ రెండు పథకాల ద్వారా అనేక కుటుంబాలు ప్రయోజనం కలగడమేకాదు నగర పాలక సంస్థకు సుమారుగా వంద కోట్ల వరకు ఆదాయాన్ని తెచ్చిపెట్టే అవకాశాలున్నాయి. గడిచిన ఆరేళ్లగా పురపాలక శాఖ అటు బీపీఆర్, ఇటు ఎల్‌ఆర్‌ఎస్ అనుమతులు ఇవ్వక అనేక మంది సందిగ్ధంలో ఉండిపోయారు. ఇకనైనా ఆ ఫైల్ కదిలించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శరవేగంగా విస్తరిస్తున్న నగరంలో భవన నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వీటిలో 10 శాతంకుమించి నిబంధనలు అతిక్రమించనవి మూడొంతులు ఉన్నాయి. పాత భవనాలను ఆధునీకరిస్తూ చేసిన అనేక నిర్మాణాలను అతిక్రమణ కిందే అధికారులు గుర్తిస్తున్నారు. వీటికి అనుమతులు రావాలన్నా, బ్యాంకు రుణాలకు ఆమోదం పొందాలన్నా బీపీఎస్ ఒక్కటే మార్గం. 10 శాతంకు మించిన అతిక్రమణలు వంద శాతం వరకు ఈ స్కీంలోనే క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాలున్నాయి. ప్రస్తుతం నెల్లూరు పాత భవనాలదారులతో పాటు నూతన భవన నిర్మాణదారులు ఈ స్కీం కింద అనుమతులు పొందేందుకు ఎదు రు చూస్తున్నారు. 10 శాతం నిబంధనలను అతిక్రమించిన భవనాలకు ఎన్ఎంసీలోని సిటీప్లానింగ్ అధికారులు కమిషనర్ నేతృత్వంలోనే జరిమానా లు విధించి క్రమబద్ధీకరణ చేసేస్తుండగా అంతకు మించిన అతిక్రమణకు చర్యలు తీసుకునే అధికారంలేకపోవడంతో బీపీఎస్ ద్వారానే ముందడుగు వేయాల్సి ఉంది. దీంతో వందల మంది ఈ స్కీం కోసం పడిగాపులుకాస్తున్నారు.

● ఎల్‌ఆర్‌ఎస్ పైనే ఆశలన్నీ...

భవన నిర్మాణాలు చేపట్టే స్థలాలు అత్యధిక శాతం అక్రమ లేఅవుట్లలో ఉండటంతో పురపాలక శాఖ నుంచి అనుమతులు అందడంలేదు. నెల్లూరు సిటీతోపాటు రూరల్లోని ఎక్కువ శాతం నిర్మించిన లేఅవుట్లు అక్రమ లేఅవుట్లగా ఇటు నుడా, అటు కార్పోరేషన్ అధికారులు తేల్చారు. వీటిల్లో ఇల్లు నిర్మించుకోవాలంటే గతంలో ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా మార్కెట్ విలువలో 7 శాతం అపరాధ రుసుము చెల్లించి భవన నిర్మాణాలకు అనుమతులు పొందుతున్నారు. కానీ ప్రస్తుతం ఎల్‌ఆర్ఎస్ లేకపోవడంతో భవన నిర్మాణ అనుమతులు నిలిచిపోయాయి. ఎల్‌ఆర్‌ఎస్‌తో సంబంధం లేకుండా స్థలం మార్కెట్ విలువపై 14 శాతం అపరాధ రుసుము చెల్లించి భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే మరో మార్గాన్ని కూడా పురపాలక శాఖ నిలిపివేసింది. దీంతో భవన నిర్మాణ రంగం పూర్తిగా కుదేలైంది.

● రూ. వంద కోట్లు పైనే ఆదాయం

భవన నిర్మాణాలు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణతో నెల్లూరు కార్పొరేషన్‌కు రూ.వంద కోట్ల వరకు ఆదాయం సమకూరు అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీపీఆర్, ఎల్‌ఆర్‌ఎస్‌ల ద్వారా ఈ ఆదాయం ప్రత్యక్షంగా ఎన్ఎంసీకి చేకూరుతుందని భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పురపాలక శాఖలో అనేక సంస్కరణలు తెరపైకి తీసుకువచ్చింది. ఇందులో ముఖ్యంగా స్థానిక సంస్థల ఆదాయం స్థానికంగానే ఖర్చు చేసుకోవచ్చని నిర్ణయించారు. ఈ లెక్కన బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్‌ల ద్వారా వచ్చే సుమారు వంద కోట్ల ఆదాయం నగర అభివృద్ధికే వినియోగించుకునే అవకాశాలున్నాయని నిపుణులు లెక్కకడుతున్నారు.

● ఆరేళ్లగా ఎదురుచూపులు

అక్రమ లేఅవుట్లతోపాటు అందులో నిర్మించే భవనాల క్రమబద్ధీకరణ కోసం ప్రజలు ఆరేళ్లగా ఎదురుచూస్తున్నారు. మధ్య తరగతి, ఆపై వర్గాలవారంతా స్థలాలు కొనుగోలు చేసుకుని వాటిల్లో భవనాలు నిర్మంచుకునేందుకు అనుమతులు లేక అల్లాడుతున్నారు. ఇటు పాతభవనాలను ఆధునీకరించుకోలేక, 10 శాతం అతిక్రమించిన నూతన భవనాలకు రెగ్యూలైజేషన్ చేసుకోలేక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2019లో జనవరి 1వ తేదీన బీపీఎస్ విడుదల చేసిన ప్రభుత్వం ఏప్రిల్ 3వ తేదీన ఆపేసింది. అటు ఎల్‌ఆర్‌ఎస్‌ను 2020లో జనవరిలో విడుదల చేసిన పురపాలక శాఖ ఏప్రిల్‌తో నిలిపుదల చేసింది. ఆ మధ్యకాలంలో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంది. ఆ తర్వాత ఈ రెండు పథకాలను అమలు చేయకపోవడంతో ఎంతో మంది ఆటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

న్యూస్ బాక్స్

రేపు ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునః ప్రతిష్ఠ

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, దివంగత నేత ఆనం వెంకటరెడ్డి కాంస్య విగ్రహాన్ని నగరంలో ఆదివారం పునఃప్రతిష్ఠించనున్నారు. రామలింగాపురం జంక్షన్‌లో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని సింహపురి సేవా సమితి ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆనం కుటుంబ సభ్యులు, అభిమానులు, నగర ప్రముఖులు, ఆత్మీయులు పాల్గొంటారని తెలిపింది.

కాగా, తమ తాత ఆనం వెంకటరెడ్డి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి తరలిరావాలని వెంకటరెడ్డి మనుమడు ఆనం రంగమయూర్‌రెడ్డి వర్తక వాణిజ్య రంగాల ప్రముఖులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్టోన్ హౌస్ పేటలోని రైస్ క్యాన్వాసింగ్ ఏజెంట్స్ కార్యాలయంలో సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆనం వెంకటరెడ్డి నగరానికి అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా మయూర్‌ను షేగు షణ్ముఖరావు తదితరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, ఎంపీ అంజనేయులు, కోట సత్యనారాయణ, భవనాసి సురేష్ తదితరులుల పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌కు అత్యాధునిక శస్త్రచికిత్సలు

నెల్లూరు (వైద్యం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో బ్రెయిన్ ట్యూమర్ వ్యాధికి అత్యాధునిక శస్త్రచికిత్సలు చేస్తున్నామని ప్రముఖ వైద్యులు డాక్టర్ గంగపట్నం ధీరజ్, డాక్టర్ దినేష్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ట్యూమర్‌ను ముందుగానే గుర్తిస్తే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. నిత్యం తలనొప్పి, పనిఒత్తిడి, మతిమరుపు, వయసు ప్రభావంగా కళ్ల తిరగటాన్ని తేలిగ్గా తీసుకోవద్దని, ఈ సాధారణ లక్షణాలే మెదడులో తీవ్ర సమస్యలను తీసుకు వస్తాయని, వైద్యులకు చూపించుకోవాలని వారు సూచించారు.

విజయ డెయిరీలో ఉద్యోగ ఖాళీల్లేవు : ఎండీ

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సమితి(విజయ డెయిరీ)లో ప్రస్తుతం ఎలాంటి ఉద్యోగ ఖాళీలు, నియామకాలు లేవని డెయిరీ ఎండీ పీసీ కృష్ణమోహన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డెయిరీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక ప్రైవేటు ఏజెన్సీ పేపర్లలో ప్రకటనలు ఇస్తూ నగదు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. డెయిరీకి సంబంధం లేకుండా ఇలాంటి ప్రకటనలు ఇచ్చే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిరుద్యోగులు తప్పుడు ప్రకటనలు నమ్మి డబ్బు ఇవ్వొద్దని ఆయన కోరారు.

నేడు 'బత్తిన' సంతాపసభ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సామాజికవేత్త, తెలుగు-సంస్కృత అధ్యాపకుడు బత్తిన సాయి కుమార్‌రెడ్డి సంతాప సభ శనివారం జరగనుంది. ఈ కార్య క్రమం సాయంత్రం 6.30 గంటలకు టౌనుహాలులో జరుగుతుందని శ్రీరామకృష్ణ వివేకానంద భావ ప్రచార సమితి ఒక ప్రకటనలో తెలిపింది. అందరూ పాల్గొనాలని కోరింది.

ఏపీజీఈఏ రాష్ట్ర కార్యదర్శిగా చక్రవర్తి నియామకంపై హర్షం



నెల్లూరు(హరనాథపురం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన ఎస్ చక్రవర్తి ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో ఆయనను ఎన్నుకున్నారు. దీనిపై సంఘం జిల్లా అధ్యక్షుడు బీ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.



కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధం

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

? కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారా

! అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నాము. 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 29 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కడైనా కరోనా అనుమానితులు ఉంటే వెంటనే వారి నుంచి వ్యాధి నిర్ధారణ నమూనాలు తీసి జీజీహెచ్‌కు పంపుతున్నారు. కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయితే అక్కడే ఉన్న 30 పడకల ద్వారా వైద్య చికిత్సలు అందిస్తాం. లేదంటే హోం ఐసో లేషన్‌లోనే ఉండేలా అన్ని వైద్య సదుపాయాలు కల్పిస్తాం. ప్రభుత్వం ప్రస్తుతానికి 1000 కిట్లు అందచేస్తామని వెల్లడించింది. దీని ద్వారా హోం ఐసోలేషన్‌లో ఉన్న కరోనా రోగులకు వైద్య సేవలు అందిస్తాం.

? పీహెచ్‌సీల గ్రేడ్లు ఎందుకు తగ్గుతున్నాయి

! జిల్లాలోని పీహెచ్‌సీల గ్రేడ్లు తగ్గిన మాట వాస్తవమే. లోపం ఎక్కడ ఉందో తెలుసుకుంటాను. వెనుకబడిన ఆసుపత్రు ల్లో వైద్య చికిత్సలు మెరుపడేలా చర్యలు తీసుకుంటాను. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సంస్కరణలు తీసుకు వస్తాను.

? మాతా,శిశు మరణాలు ఇంకా ఎందుకు సంభవిస్తున్నాయి

! జిల్లాలో మాతా,శిశు మరణాలు ప్రతి నెల నమోదవుతూనే ఉన్నాయి. వీటిని నివారించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. గర్భం దాల్చినప్పటి నుంచి మహిళలకు అందే వైద్య సేవలపై వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. రక్త హీనత, ఇతర అనారోగ్య కారణాల వల్ల మరణాలు సంభవిస్తున్నాయి. వాటి నివారణకు చర్యలు చేపడుతున్నాం.

- నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి)

మహాలక్ష్మికి లక్ష మల్లెల అర్చన



నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాంనగర్‌లో వెలిసి ఉన్న చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం లక్ష మల్లెల అర్చన జరిగింది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమాన్ని లక్ష్మీకుమారి, సాయి భార్గవి, బాలాజీ, లక్ష్మణరావు, తదితరులు పర్యవేక్షించారు.

● నగరంలోని కొత్తూరు భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమంలో శుక్రవారం పార్వతీ అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకారం జరిగాయి. అమ్మవారికి మల్లెపూల చీర అలంకారంతో పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆనందస్వామి, భక్తులు పర్యవేక్షించారు.

కాలువల్లో పూడిక తీయండి : కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పత్తేఖాన్‌పేటలో ఉన్న కాలువల్లో పూడిక తీయాలని సిబ్బందిని కమిషనర్ నందన్ ఆదేశించారు. ఆయన శుక్రవారం పత్తేఖాన్ పేటలో పర్యటించారు. రోడ్లు, కూడళ్లు, కాలువల్లో చెత్త వేసేవారిని గుర్తించి జరిమానా విధించాలని సూచించారు. వీధిదీపాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించి వైద్యశాలలో చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మరణించింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని బీవీ నగర్ సప్తగిరి కాలనీలో చెందిన వెంకటేశ్వర్లు, నాగరత్నమ్మ(44) దంపతులు నివసిస్తున్నారు. వారి చిన్నకుమారుడు మాట వినడం లేదని క్షణికావేశంలో గత నెల 23న నాగరత్నమ్మ బాత్రూమ్ శుభ్రం చేసే యాసిడ్ తాగింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన నారాయణ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం నాగరత్నమ్మ మృతి చెందింది. భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకట్టుకుంటున్న ఆర్ఆర్ఆర్ - అవెంజర్స్ ఎగ్జిబిషన్



నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలో వైఎంసీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ - అవెంజర్స్ ఎగ్జిబిషన్ నగర వాసులకు వేసవి వినోదాన్ని అందిస్తోంది. ఆర్ఆర్ఆర్ సినిమాలోని ఘట్టాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీని ప్రేక్షకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. అలాగే హాలీవుడ్ చిత్రం అవెంజర్స్ స్టాల్స్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఎగ్జిబిషన్ ప్రతీరోజు సాయంత్రం 4 నుంచి రాత్రి 10గంటల వరకు తెరిచి ఉంటుందని నిర్వాహకుడు బాబు తెలిపారు. సందర్శకులు గ్రూపుగా వస్తే రాయితీ కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా హేనా సుజన్

నెల్లూరు (హరనాథపురం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా హేనాసుజన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె జిల్లాలో పీడీగా పని చేశారు. ఐసీడీఎస్ ద్వారా ఉత్తమ సేవలు అందిస్తామని ఆమె చెప్పారు.

నేడు మంత్రి ఆనం కందుకూరు పర్యటన

కందుకూరు/వలేటివారిపాలెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం కందుకూరు నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఉదయం 8.30 గంటలకు గ్రామదేవత అంకమ్మ ఆలయం వద్ద నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు, ఆర్టీసీ బస్టాండ్‌లో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న షాపింగ్‌కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమవుతారని టీడీపీ నాయకులు తెలిపారు. అనంతరం వలేటివారిపాలెం, మాలకొండలో పర్యటించనున్నారు.

ప్రసన్న వ్యాఖ్యలు అనుచితం

● టీడీపీ రాష్ట్ర నేత శేఖర్‌రెడి



మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నుంచి టీడీపీలో చేరడం రెడ్‌లైట్ ఏరియాలో అమ్ముడుపోయినట్లు ఉందంటూ కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అనుచిత మని టీడీపీ రాష్ట్ర నాయకుడు జీవీఎల్ శేఖర్‌రెడ్డి విమర్శించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి గురించి మాట్లాడే అర్హత ప్రసన్నకు లేదన్నారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీలో చేరిన వారు ఒక్కరూపాయి కూడా తీసుకోకుండా పార్టీలో చేరారని వెల్లడించారు. ప్రసన్నకు దమ్ముంటే టీడీపీకి అమ్ముడు పోయినట్లు నిరూపించాలని సవాలు విసిరారు. గత ఎన్నికలకు ముందు రాజుపాళెంలో శివుడికి పూజ పేరుతో ప్రశాంతి రెడ్డి నుంచి ప్రసన్న కోట్ల రూపాయలు చందా తీసుకున్నారన్నారు. హైదరాబాద్‌లో ఆయన కట్టిన భవనాలు పేదల సొమ్ము కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మల్లికార్జున, భూలోకం విజయకుమార్, పొన్నుబోయిన చెంచుకిశోర్ తది తరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అనుభవమే రాష్ట్రాన్ని గట్టెక్కిస్తుంది

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని గత వైసీపీ ప్రభుత్వం దివాలా తీయించిందని, ప్రస్తుతం ఆర్థికంగా పరిస్థితులు బాగోలేకపోయిన సీఎం చంద్రబాబు అనుభవమే రాష్ట్రాన్ని గట్టెక్కిస్తుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చంద్రన్న పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గొల్లకందుకూరు, సజ్జాపురం, వెల్లంటి, కందమూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి సర్కారు ఒక్కొకటిగా నెరవేర్చుకుంటూ వస్తోందని తెలిపారు. రూరల్‌లో తాజాగా రూ.11 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను 18 గ్రామాల్లో ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు పొణక హరిప్రసాద్‌రెడ్డి, శివకుమార్ రెడ్డి, దయాక ర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మురళీరెడ్డి పాల్గొన్నారు. అనంతరం పెనుబర్తి, సౌత్‌మోపూరు రైతులకు డ్రోన్లను వ్యవసాయ శాఖ ద్వారా అందించారు.

కార్పొరేట్ విద్యాలయాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నెల్లూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాల పేరుతో వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఈవో బాలాజీరావుకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలు తమ ఇష్టానుసారంగా విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. భవన నిర్మాణాలు కూడా పూర్తి కాకుండానే యూనిఫామ్, పాఠ్యపుస్తకాలను విచ్చలవిడిగా విక్రయి స్తూ అడ్మిషన్లు చేపట్టడం అన్యాయమన్నారు. వీటిపై ఉన్నతాధికా రులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో గందరగోళం

(5వ పేజీ తరువాయి)

గణితం, పీఎస్, బీఎస్, సోషల్ టీచర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల చేశారు. అనంతరం లాంగ్వేజెస్‌లో తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం టీచర్ల బదిలీ ఉత్తర్వులు కూడా విడుదల చేసి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అధికారికంగా డౌన్‌లోడ్ చేశారు. అయితే ఈ ఉత్తర్వులు వెలువడిన తరువాత ఎస్ఏలు తమకు అన్యాయం జరిగిందంటూ విద్యాశాఖ కార్యాలయం ఎదుట బైఠాయించారు.

● టీచర్ల ఆందోళన

స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు వెబ్‌ఆప్షన్ల ద్వారా విడుదల అయిన బదిలీ ఉత్తర్వుల్లో అవకతవకలు జరిగాయంటూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. నగరంలోని డీఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన ఈ ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం నుంచి ప్రహసనంగా మారిందని, పాయింట్ల కేటాయింపుల్లో ఉపాధ్యాయులకు అన్యా యం జరిగిందన్నారు. బదిలీలపై జరిగిన అవకతవకలపై విచారణ చేసి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకల వెబ్‌ఆప్షన్‌ల విధానానికి స్వస్తి పలికి ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఈ ఆందోళనలో ఏపీటీఎఫ్ నేతలు పిచ్చిబాబు, జుల్ఫికర్ అలీ, రియాజ్, వెంకటేశ్వర్లు, గురవయ్య, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్, వెంగబాబు తదితరులలు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య

నెల్లూరు (వైద్యం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో పలువురు ఆటో కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆటో కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు పోరాడుతామని చెప్పారు. అనంతరం ఆటో కార్మిక సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ కిశోర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు హబీబ్ అహ్మద్, మహిళా సంఘం నాయకురాలు శిరీష, ఆటోకార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు మధు, అధ్యక్షకార్యదర్శులు ప్రసాద్, సునీల్, ఉపాధ్యక్షుడు రెహమాన్, కోశాధికారి అంజయ్య, కొండయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐటీయూసీలో చేరిన ఆటో కార్మికులతో సీపీఐ నాయకులు



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న చైర్మన్ ధనుంజయరెడ్డి

రేపు ఏపీసీబీఈఏ మహాజన సభ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీసీబీఈఏ 10వ రాష్ట్ర మహాజన సభ ఆదివారం మచిలీపట్నంలో జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు కుమార్‌పాల్ తెలిపారు. మహాజన సభ గోడ పత్రికలను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుం జయరెడ్డి శుక్రవారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. కుమార్‌పాల్ ఆధ్వర్యంలో నాయకులు చైర్మన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గౌస్‌బాషా, హరి, గరునాథం, శివ, శ్రీహరి, మహేష్, వెంకటేశ్వర్లు రాజు, కృష్ణయ్య, కోటేశ్వరరావు, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలకు నేటికీ అవే పేర్లు



పేరుమార్చని వీరంపల్లి రైతుభరోసా కేంద్రం

మనుబోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచింది. అయినా గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలకు అవే పేర్లు కొనసాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కేంద్రాలను రైతుసేవా కేంద్రాలుగా మార్చాలని ఆదేశించింది. మండలంలో 14 రైతుభరోసా కేంద్రాలకు గాను 6 కేంద్రాలను మాత్రమే నిర్మించారు. ఒక్కదానికి కూడా పూర్తిస్థాయిలో పేర్లు మార్చలేదు. జిల్లావ్యాప్తంగా 545 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి పేరు మార్చడానికి రూ. 371 ప్రభుత్వం విడుదల చేసింది. కానీ క్షేత్రస్థాయిలో పేర్ల మార్పు సక్రమంగా జరగలేదు. కాగా, దీనిపై జిల్లా వ్యవసాయా ధికారిణిని వివరణ కోరగా అన్ని చోట్ల పేర్లు మార్చేశామని, అన్ని కేంద్రాలకు వ్యవసా యాధికారుల ఖాతాల్లో ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు వేశామని చెప్పడం విశేషం.



అక్కంపేటలో ఇలా...



అపూర్వం.. ఆదర్శం

నాలుగు దశాబ్దాల క్రితం అంతా ఆ పాఠశాలలో చదివిన వారు. ఉన్నత చదువులు పూర్తయి, వివిధ రంగాలలో స్థిరపడ్డారు. ఇప్పుడు అంతా ఒకచోట కలిశారు. చిన్ననాడు తాము చేసిన అల్లరిని నెమరు వేసుకున్నారు. ఎవరు.. ఎక్కడెక్కడ ఏమేమి పనులు చేస్తున్నారో సరదాగా మాట్లాడుకున్నారు. చివరిగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురు వులను సత్కరించారు. మర్రిపాడు మండలం కంపసముద్రం పాఠశాలలో 1955-86లో 10వ తరగతి చదివిన విద్యార్థులంతా శుక్రవారం నెల్లూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కలిశారు. నాడు విద్యా బుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

పులి వాహనంపై చాముండేశ్వరి వైభోగం

ఇందుకూరుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపట్నంలో శ్రీ చాముండేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కాగా, రాత్రి అమ్మవారు పులివాహనంపై కొలువుదీరి పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 764 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 508 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 256 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 180 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

● **కలిగిరి :** కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 461 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 312 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-127, ఆర్ఆర్-6, సీఆర్-9, జంపింగ్ లాట్స్-7 కారణాలతో 149 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.232.15గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ స్టోన్ తరలిస్తున్న లారీ పట్టివేత

ఉలవపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : సీజ్ చేసిన గ్రావెల్ స్టోన్ డంప్ నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా, సింగరాయకొండ మండలం, శానంపూడి గ్రామంలో ఉలవపాడుకు చెందిన నీలకంఠేశ్వర స్వామి ఆలయం భూములు ఉన్నాయి. ఆ భూముల్లో విలువైన గ్రావెల్ స్టోన్‌ను ఫణి అనే వ్యక్తి అక్రమంగా తవ్వి విక్రయించుకుంటూ గత ఏడాది ఉలవపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న లారీ అసోసియేషన్ భవనం వెనుక డంప్ చేశారు. దీనిపై దేవాదాయశాఖ అధికారుల ఫిర్యాదు అందడంతో డంప్ చేసిన గ్రావెల్ స్టోన్‌ను అప్పట్లో స్థానిక పోలీసులు సీజ్ చేశారు. అయితే శుక్రవారం అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ స్టోన్‌ను టిప్పర్లకు నింపి చెన్నైకు తరలిస్తున్నారనే సమాచరంతో దాడులు చేసి సదరు వ్యక్తులను, వాహనాలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రండయ్యా.. రండి... భలే... ఎండు చేపలండి!



కోవూరు సమీపంలోని లక్ష్మీనగర్ ప్రాంతం





ఏ రకం కావాలన్నా కేరాఫ్ లక్ష్మీనగర్

కొన్నేళ్లుగా ఎన్నో కుటుంబాలకు ఇదే వ్యాపారం

కోవూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మత్స్యప్రియులం దరికీ కోవూరు సమీపంలోని లక్ష్మీనగర్ ఎంతో ఇష్టమైన ప్రదేశం. కడప, చిత్తూరు, అనంతపురం జిల్లా ల్లోని మాంసాహారప్రియులు నెల్లూరు వస్తే ఖచితంగా ఈ లక్ష్మీనగర్‌కు చేరుకుంటారు. తమకు ఇష్టమైన ఎండు చేపలను కొనుగోలు చేసుకుని ఇళ్ల తీసుకెళతారు. చాలా ఏళ్ల కిందట విడవలూరు మండలం రామతీర్థం, లక్ష్మీపురం తదితర గ్రా మాలకు చెందిన మత్స్యకారులు కోవూరు-నెల్లూరు మార్గంలోని సాలుచింతల సమీపంలో కాలనీ ఏర్పాటు చేసుకుని ఎండుచేపల వ్యాపారం ప్రారంభించారు. మొదట్లో జిల్లాలోని సముద్ర తీరం వెంబడి మత్స్యకారుల నుంచి చేపలు కొనుగోలు చేసి ఎక్కడికక్కడే ఎండబెట్టి లక్ష్మీనగర్‌కు తీసుకవచ్చి విక్రయించేవారు. అయితే, నెల్లూరు జిల్లా తీరంలో మత్స్య సంపద తగ్గడంతో రకరకాల ఎండు చేపల కోసం విశాఖ మార్కెట్టును ఆశ్రయించారు. అక్కడి నుంచి వ్యాన్లలో సరుకును తీసుకువస్తారు. అయితే, రవాణా భారం ఎక్కువవడంతో వ్యాపారులంతా చేరి గ్రూపులుగా విభజించి, సరుకును దిగుమతి చేసు కోవడంతో వ్యాపారం లాభసాటిగా మారింది. తాటియాకు చేపలు, బొమ్మిడాయిలు, రొయ్యపొట్టు, మెత్తాళ్ళు, చెరువు చేపలు, కంట చుక్కల చేపలకు గిరాకీ ఉంటుంది.



జీవనానికి ఆధారమిదే

ఎండు చేపలు అమ్మడమే మా పని. మా కుటుంబానికి ఆధారమిదే. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండొచ్చినా... వానొచ్చినా ఎండు చేపల్ని అమ్ముతుంటాం. కుటుంబాన్ని పోషించుకోగలిగిన ఆదాయమే వస్తోంది.

- కుమారి, ఎండుచేపల విక్రేత



ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ...

మాది పడమట ప్రాంతం. అక్కడ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డాం. ఎండు చేపలు అమ్ముతూ బతికేస్తున్నాం. ఇది తప్ప మాకు రెండో పని లేదు. కుటుంబమంతా ఎండు చేపల అమ్మకానికే పని చేస్తుంది. చేపల్ని ఆరబెట్టు కోవాలి. శుభ్రం చేయాల్సి ఉంటుంది.

- చింతంగారి పాపమ్మ,లక్ష్మీనగర్

అబ్బో.. తాటాకు చేప

ఎండు చేపలు కోసం ఇక్కడికి ఎన్నో సంవత్సరాల నుంచి వస్తున్నా. ఎండు చేప తగలందే ముద్ద దిగదు. తాటాకు చేప రుచే వేరు. మా ఇంట్లో లొట్టలేసుకుని తింటారు.



- జీవమ్మ వెంగళ్రావు నగర్

● **రారాజు తాటియాకు చేప**

ఎండుచేపల్లో రారాజు తాటియాకు చేప. విశాఖ, కాకినాడ ప్రాంతాల నుంచి వ్యాన్లలో తీసుకువచ్చి లక్ష్మీనగర్‌లో విక్రయిస్తుంటారు. కిలో తాటియాకు చేప రూ.250 నుంచి 300, బొమ్మిడాయిలు రూ.150, రొయ్యపట్టు రూ.200 నుంచి 250, మెత్తాళ్ళు రూ.300 నుంచి 400, చెరువు చేపలు రూ.150 నుంచి 200, కంట చుక్కలు రూ.100 నుంచి 150 వరకు ధర పలుకుతున్నాయి. విశాఖ నుంచి వ్యాను బాడుగ రూ.15వేల నుంచి 20 వేల వరకు పలుకుతోంది. కాబట్టే ఎండు చేపల ధరలను పెంచాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు.

● **దూరప్రాంత వ్యాపారులు వస్తేనే ఆదాయం**

లక్ష్మీనగర్‌లోని ఎండు చేపల దుకాణాలకు దూరప్రాంత వ్యాపారులు వస్తేనే ఆదాయం వస్తుందని మత్స్యకారులు చెబుతున్నారు. దూర ప్రాంత వ్యాపారులు ఒక్కో రకాన్ని 100 నుంచి 200 కిలోలు కొనుగోలు చేస్తుంటారని, ఇలా పెద్ద మొత్తంలో చేపలు విక్రయిస్తేనే ఆదాయం వస్తుందని చెప్పారు. ఇక స్థానికులు, జిల్లావాసులు ఒక్కొక్కరు అర కిలో నుంచి కిలో వరకు కొనుగోలు చేస్తారనీ చెప్పారు. వందమంది కొనుగోలుదారులు వస్తే 50 నుంచి 75 కిలోల ఎండుచేపలు మాత్రమే అమ్మగలమని వివరించారు.

జీవితంలో యోగా భాగం కావాలి

● **'యోగాంధ్ర'లో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్**

నెల్లూరు(విద్య), జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మానవ జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నెల్లూరులోని ఏసీ సుబ్బా రెడ్డి స్టేడియంలో రెసిడెన్షియల్ థీమాటిక్ సామూహిక యోగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందని చెప్పా రు. జిల్లాలో ఇప్పటికే 10 లక్షల మంది యోగా మీద మక్కువతో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. 124 మంది మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఏడు వేల మందికి గ్రామ, వార్డుస్థాయిల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈనెల 9న గ్రామ, వార్డు స్థాయిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామ న్నారు. 21వతేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున జిల్లాలో 2వేల ప్రదేశాల్లో నిర్వహిస్తున్న యోగా కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగాసనాలు వేశారు. యోగాలో ఉత్తమంగా రాణిస్తు న్న చిన్నారులను అభినందించారు. స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరాలకు హాజరయ్యే బాల, బాలికలకు పౌష్టికాహారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ డైరక్టర్ మాధురి, డీఎస్‌డీవో యతిరాజ్, జిల్లా ఆయుష్ అధికారి గోవిందయ్య, యోగా గురువు స్వప్న, అధికారులు, వాకర్స్ విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, స్టేడియంలో జరిగిన యోగాసన కార్యక్రమాల్లో ఎన్‌సీసీ కేడెట్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. కేఎస్ఆర్ పాఠశాల, వెంగళరావునగర్ మునిసిప ల్ ఉన్నత పాఠశాల, సంతపేట ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ ధ్యానం, యోగాలో భాగస్వాములయ్యారు. వారిని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ అభినందించారు. కార్యక్రమం లో ఎన్‌సీసీ అధికారులు గుండా ల నరేంద్రబాబు, సీవీ నాగరాజు, డీ పెంచలయ్య పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, అధికారులు, విద్యార్థులు



'యోగాంధ్ర' అక్షర రూపంలో సాధకులు

● **రేపు సీనియర్ సిటిజన్స్‌కు..**

'యోగాంధ్ర'లో భాగంగా ఆదివారం సీనియర్ సిటిజన్స్‌కు యోగా కార్య క్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం జిల్లా అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు, కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేపట్టాలని, వాకర్స్ సంఘాలు అన్నీ హాజరయ్యేలా చూడాలని సూచించారు. 14వతేదీన జిల్లా అంతటా యోగా డెమో కార్యక్రమం చేపట్టాలని, ఇందుకు అవసర మైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

'మాలకొండ' పాలకవర్గం ఎప్పటికో!

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి పాలకవర్గం నియామకం నేటికీ జరగలేదు. గత నెల కడపలో జరిగిన టీడీపీ మహానాడులోపు నామినేటెడ్ పదవుల నియామకం పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సాధారణంగా స్థానిక ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉన్న వారినే ఆ పదవులు వరిస్తాయి. ఈ నేపథ్యంలో 'మాలకొండ' ఛైర్మన్ పదవికి అంకభూపాలపురానికి చెందిన టీడీపీ నేత ప్రగడ నరసింహం, పోలినేనిపాలెంకు చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసింహం పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. 2014-15, 2015-16 ఆర్థిక సంవత్సరంలో

● **ఎమ్మెల్యే చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు**

అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చుండికి చెంది న టీడీపీ సీనియర్ నేత చెరువుపల్లి మాల్యాద్రి మాలకొండ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత తొమ్మిదేళ్ల పాలక వర్గం ఏర్పాటు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఎం చంద్రబాబు నామినేటెడ్ పదవుల నియామకం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో టీడీపీ నేతల్లో ఆశలు చిగురించాయి. మాలకొండ ఛైర్మన్ పదవి కోసం రెండు నెలల నుంచి ఆశావాహులు కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు చుట్టూ ప్రదక్షిణలు చేస్తునట్లు సమచారం. అయితే, ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

రాజరాజేశ్వరి సేవలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్

నెల్లూరు(సాంస్కృతికం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారిని అగ్నిమాపక శాఖ రాష్ట్ర డైరెక్టర్ డీ మురళీ మోహన్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చ కులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మ వారికి సుందరేశ్వర స్వామికి, గాయత్రీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనము అందజేశారు. కాగా, శుక్రవారం ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రాహుకాల దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీసేవ జరిగాయి.



మురళీమోహన్ దంపతులకు వేదాశీస్సులు అందజేస్తున్న అర్చకులు

డీఆర్‌డీఏలో బది'లీలలు'

● **స్వాహారాయుళ్లపై ప్రత్యేక దృష్టి !**

నెల్లూరు (హరనాథపురం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభి వృద్ధి శాఖ (డీఆర్‌డీఏ)లో ఉద్యోగుల బదిలీ ప్రక్రియపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబం ధ నలకు విరుద్ధంగా ఈ బదిలీలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ నెల 2వతేదీ వరకే బదిలీలకు గడువు ఇచ్చిన ప్రభుత్వం ఆ తర్వాత 9వ తేదీ వరకు దానిని పొడిగించిన విషయం విదితమే. ఒకే స్థానంలో ఐదేళ్లుగా పని చేస్తున్నవారు, క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటు న్నవారు, ఒకే జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారు, వ్యక్తిగత అభ్యర్థనతో ఇష్టపూర్వకంగా బదిలీ కోరుకున్నవారు మాత్రమే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బదిలీలకు అర్హులు. అయితే ఇందుకు భిన్నంగా డీఆర్‌డీఏ లో ఎల్-4 కేడర్‌లో క్రమశిక్షణ చర్యలు తీసుకు న్న వారిని, దీర్ఘకాలికంగా జిల్లాలో పనిచేస్తున్న వారిని పక్కన పెట్టి బదిలీలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఏ రకమైన క్రమశిక్షణా చర్యలు లేనివారిని, స్పౌజ్‌కి అర్హత ఉన్నవారిని బలవంతపు బదిలీ చేస్తున్నట్లు సమాచారం. ఆ శాఖలో ఎల్-3 కేడర్ బదిలీలు కూడా ఇదే విధంగా కొనసాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్-3 కేడర్‌లో దీర్ఘకాలంగా పని చేస్తున్న వారిని పక్కన పెట్టి అర్హత లేని వారిని బలవంతంగా బదిలీ చేస్తున్నట్లు సమాచారం. కాగా, డీఆర్‌డీఏలో దీర్ఘకాలం పనిచేసి అనేక ఆరోపణలు ఎదుర్కొన్న వారు ఎందరో ఉన్నారు. వారి జాబితాను అధికారులు పరిశీలించారు. పని తీరు, ఆరోప ణల నివేదికలను గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు పంపారు. పొదుపు మహిళల నగదును స్వాహా చేసిన ఆరోపణ లతో సస్పెండయిన కేసులు డీఆర్‌డీఏ లో ఎన్నో ఉన్నాయి. కొందరు డీపీఎం, ఏపీఎం స్థాయి వారు స్వాహాకు, అక్రమాలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. రాజకీయ పలు కుబడితో తిష్టవేసుకుని ఒకే స్థానంలో సుదీర్ఘకా లం సీటు మారకుండా పనిచేస్తున్నవారు కూడా ఉన్నారు. బదిలీల సందర్భంగా వీరిపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు తెలిసింది.



డీఆర్‌డీఏ కార్యాలయం

విలువలతో కూడిన విద్య ఉపయోగకరం : ఎస్పీ

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): విలువలతో కూడిన విద్య పిల్లల భవిష్య త్తుకు ఎంతో ఉపయోగపడు తుందని ఎస్పీ జీ కృష్ణకాంత్ అన్నారు. ఉమేష్‌చంద్ర కాన్ఫ రెన్స్ హాల్లో శుక్రవా రం పోలీసుల పిల్లల కు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ప్రవేశం కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన పోలీ సుల పిల్లలు 111 మందికి 11 కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత, రాయితీ అడ్మిషన్స్ కల్పించినట్లు చెప్పారు. క్రమశిక్షణతో శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి వెళ్లాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉచిత అడ్మిషన్స్ అందించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఏవో చంద్రమౌళి, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, అడ్మిన్ ఆర్ఐ అంకమరావు, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్స్ పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

సోమశిలలో 40.980 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి 40.980 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 345 క్యూసెక్కులు వస్తుండగా పెన్నా డెల్టాకు 3,250, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9360
వెండి కిలో ధర	రూ. 108400
వెండి ఒక గ్రాము	రూ. 111.50

రైతుసేవా కేంద్రాల్లో అలంకారప్రాయంగా కుయోస్క్‌లు

● వైసీపీ పాలనలో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా


మర్రిపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందిస్తాంటూ గత వైసీపీ ప్రభుత్వం రూ. లక్షలు వెచ్చించి ఆర్భాటంగా రైతుభరోసా కేంద్రాలకు సరఫరాచేసిన కుయోస్క్‌లు, ఎల్ ఈడీ టీవీలు నిరుపయోగంగా మారాయి. సిబ్బంది ఫోన్‌లోనే యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవడంతో కుయోస్క్‌లు వాడక మూలకు చేరాయి. గత వైకాపా ప్రభుత్వం 2020లో అన్ని రైతుభరోసా కేంద్రాలకు (ప్రస్తుతం రైతుసేవా కేంద్రాలు)లో కుయోస్క్ యంత్రాలు ఏర్పాటుచేసింది. ఆత్మకూరు నియోజకవర్గంలో 85 కేంద్రాల్లో కుయోస్క్‌లు ఉన్నాయి. అదేవిధంగా మర్రిపాడు మండలంలో ఉన్న 17 కేంద్రాలలోనూ ఏర్పాటుచేశారు. క్రమేణా ఒక్కొక్కటిగా మూలకు చేరాయి. ఒక్కో యంత్రానికి సుమారు రూ.80వేలు ఖర్చు చేశారు. రైతులు స్వయంగా కేంద్రానికి వెళ్లి అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, పశుగ్రాసాలు అవసరమైన పరిమాణంలో కుయోస్క్‌ల ద్వారా నమోదు చేసుకొని నగదు చెల్లిస్తే 48 గంటల్లో అందిస్తామని ప్రకటించారు. ఆచరణలో సక్రమంగా అమలు చేయకపోవటంతో యంత్రాలు మూలన పడ్డాయి. ఈ యంత్రం పనిచేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. గత ప్రభుత్వం కల్పించలేదు. దీంతో సిబ్బంది సొంత నిధులతో ఆ సదుపాయం ఏర్పాటు చేసుకొని సేవలందించారు. కొంతకాలంగా కుయోస్క్‌ల బ్యాటరీలు పనిచేకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. ఎలాంటి ఆలోచన లేకుండా గత పాలకులు, ఉన్నతాధికారులు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధాచేశారని రైతులు, ప్రజలు విమర్శిస్తున్నారు.



నిరుపయోగంగా పడిఉన్న ఇర్లపాడులోని కుయోస్క్ యంత్రం, ఎల్‌ఈడీ టీవీ

రైతులకు సేవలందిస్తున్నాం

కాగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిబ్బంది తమ మొబైల్ ఫోన్‌లో యాప్‌ల ద్వారా అవసరమైన సేవలందిస్తున్నారు. మర్రిపాడు మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో కుమోస్క్‌లన్నింటినీ వినియోగంలోకి తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి రామ్మోహన్ తెలిపారు.



యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

● శ్రీహరి, మండల వ్యవసాయాధికారి

సంగం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వరిలో నారు యాజమాన్య పద్ధతులతో ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి శ్రీహరి అన్నారు.

? వరిలో యాజమాన్య పద్ధతులు అంటే..

! మొదట పొలంలో మట్టి నమూనా పరీక్షలు చేసి నేల స్వభావం తెలుసుకోవాలి. ఖనిజ లోప నివారణకు జింకు సల్ఫేట్, జిప్సం వంటివి దుక్కిలో వేయాలి. తరువాత విత్తనాలు ఎంపిక నుంచి నారుమళ్లు, నాట్లు వేసి దిగుబడి వచ్చేవరకు ఆధునిక, శాస్త్రీయ పద్ధతులు పాటించాలి.

? ఎటువంటి విత్తనాలను ఎంపిక చేసుకువాలి.

! శుద్ధమైన, నాణ్యమైన విత్తనాలను మాత్రమే ఉపయోగించాలి. మొలక శాతం అధికంగా ఉండే విత్తనాలు తీసుకోవాలి.

? విత్తనాలు చల్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

! విత్తనాలను 10 శాతం ఉప్పు ద్రావణంలో వేసి తేలిన విత్తనాలు తీసివేయాలి. మంచి విత్తనాలను శుభ్రంచేసి కార్బెండిజంతో విత్తనాలను శుద్ధి చేసుకోవాలి. 12-24 గంటలు నీటిలో నానబెట్టి పొలంలో చల్లాలి.

? నారు పీకడంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

! ఈ సీజన్‌లో నారు పీకుతున్నప్పుడు తెగడం జరుగుతుంది. అలా తెగకుండా నారు పీకడానికి నాలుగైదు రోజుల ముందు ఒక సెంటుకు 2 కేజీల జిప్సం వేయడం వల్ల నారు సులభంగా వస్తుంది.


నేటి నుంచి కోటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు

సంగం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న కోటేశ్వరాలయంలో శనివారం నుంచి 15వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రఘురామయ్య తెలిపారు. అందులో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేస్తున్నారు. ఉత్సవాల్లో గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి రోజుకో వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. 7వ తేదీ రాత్రి అంకురార్పణతో ఉత్స వాలు ప్రారంభమవుతాయి. 8వ తేదీన ధ్వజారోహణం, చిలక వాహనం, 9న రావణసేవ, 10న గిన్నెభిక్ష, నందిసేవ, 11న అంబారిసేవ, 12న కల్యాణోత్సవం, తీర్ధవాది, పురుషామృగ వాహనసేవ, 13న ధ్వజ అవరోహణ, అలకల తోపు, అశ్వ వాహనము, 14న శేష వాహనం, 15న ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి రఘురామయ్య తెలిపారు.



ముస్తాబవుతున్న కోటేశ్వరస్వామి ఆలయం

రేపటి నుంచి అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన అడవిపేరంటాలమ్మ ఆలయం

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో ఉన్న అడవిపేరంటాలమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం గడ్డంవారిపల్లి నుంచి నిలుపు కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సోమవారం కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీ, గన్నేపల్లి, మంగళవారం మిటపల్లి, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, పేరంటాలమ్మనగర్ గ్రామాల్లో గ్రామోత్సవం జరుగుతుంది. బుధవారం పసుపుకుంకుమ బండ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా వేడుకలు, గురువారం బండ్లపొంగళ్లు, ఎడ్ల బండ లాగుడు పోటీలు, విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎంయూపీ చేపట్టిన నిరసన కార్యక్రమం నాల్గో రోజైన శుక్రవారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సిక్ లీవ్‌లకు జీతాలు ఇవ్వాలని, కార్మికులపై పక్షపాత వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, శంకర్, సలాం, శివ, శ్రీను, రాములు, కాశిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ఉపాధ్యాయులు

సంగం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఏప్రిల్ 28న శిబిరం ప్రారంభమయింది. పాఠశాలలకు సెలవుల కారణంగా 40 రోజుల పాటు జరిగిన ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు గ్రంథాలయంలో ప్రతినిత్యం వివిధ నీతి కథలు, పుస్తక పఠనం, ఆట పాటల పోటీలు నిర్వహించారు. చివరిరోజు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రవీంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ స్కాలర్ షిప్‌కు ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఎంపిక

మర్రిపాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు నందవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ వారు ఇటీవల 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో లాస్య, ద్రాక్షాయని, శివకృష్ణ, రోషిని, సన ప్రతిభ చూపారు. వీరు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పూర్తయ్యే వరకు ప్రతీ ఏటా రూ.12వేల చొప్పున స్కాలర్ షిప్ పొందనున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం ప్రారంభం

వింజమూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం వింజమూరు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ శేగు సతీష్, శేగు సుబ్బారావు, నిర్మల కుటుంబ సభ్యుల దాతృత్వంతో చెన్నైలోని శంకర నేత్రాలయ వారి ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏబీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం వలన వృద్ధులు, పేదలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వాహకుడు యల్లాల రఘురామిరెడ్డి మాట్లాడుతూ కంటి వైద్య శిబిరం జూన్ 14వ తేదీవరకు కొనసాగుతుందన్నారు. అదేవిధంగా శంకర్ నేత్రాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ రంజిత్ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పద్ధతులతో అవసరమైన వారికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు అక్కడికక్కడే చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వనిపెంట సుబ్బారెడ్డి, గణపం బాలకృష్ణరెడ్డి, గురిజాల వెంకటరమణయ్య, డాక్టర్ మాసిలామణి, వైఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

రీసర్వేలో తప్పులు సవరించాలని రైతుల నిరసన

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో నిర్వహించిన భూ రీసర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలను సవరించాలని శుక్రవారం బండగానిపల్లి గ్రామ రైతులు తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పంచాయతీలోని పలు సర్వే నెంబర్లలో రీసర్వే సమయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో లేనివారు, చనిపోయిన వారి పేర్లను అడంగల్‌లో నమోదు చేశార న్నారు. గత కొన్నేళ్లగా వాటిని సవరించాలని జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారులకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తప్పిదాల వలన గ్రామంలో వివాదాలు చోటుచేసు కొంటున్నా యని, పంటల సాగుకు రుణాలు తీసుకునేం దుకు వీలులేకుండా పోతోందని వాపోయారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అంద జేశారు. స్పందించిన ఆమె వీఆర్వో, సర్వే యరును గ్రామానికి పంపి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

రూ.3.26 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణం

కలువాయి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ పథకం కింద రూ. 3.26 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తయినట్లు పంచాయతీరాజ్ ఏఈ శివారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జడ్పీటీసీ బి అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద గతంలో తవ్విన పంట కుంటలు ప్రస్తుతం ఎక్కడా లేవని, మండలంలో మొత్తం ఎన్ని కుంటలు తవ్వారు, ఎంత ఖర్చు చేశారో చెప్పాలని ఏపీవోను ఆయన ప్రశ్నించారు. సర్వసభ్య సమావేశాలకు కొంత మంది అధికారులు తరచూ రావడం లేదని, ఇక మీదట అందరూ హాజరై ప్రజా సమస్య లను తెలుసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి, ఎంపీడీవో భవాని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి

వెంటాడుతున్న ఈ-స్టాంపు కాగితాల కొరత

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఆత్మకూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈ-స్టాంపు కాగితాల కొరత కారణంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులనే ఈ-స్టాంపింగ్ విధానం ప్రవేశపెట్టారు. ఈ-స్టాంపింగ్ కాగితాల సరఫరా, ముద్రణ స్టార్ హోల్డింగ్ కార్పొరేషన్‌కు అప్పగించారు. త్వరలో స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్‌తో కుదిరిన ఒప్పంద కాలం ముగియనున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆ సంస్థ వారు స్టాంపింగ్ కాగితాల సరఫరా నిలిపివేశారు. కొన్ని ఏజన్సీల వారు కాగితాలు ఉన్నా లేవని సమాధానం చెబుతున్నారు. స్టాంపు డ్యూటీ తమ దగ్గర చెల్లిస్తేనే కాగితాలు ఇస్తామని చెబుతుండడం గమనార్హం. రూ.10, రూ.20, రూ. 50ల స్టాంపుల కొరత వెంటాడుతూనే ఉంది. ఈనేపథ్యంలో ఈ-స్టాంపింగ్ కాగితాల అమ్మకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న స్టాంపులను సైతం కొందరు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈవిషయమై ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ తాళ్లూరి శ్రీనివాసచౌదరిని వివరణ కోరగా స్టాంపుల కొరత ఉన్నమాట వాస్తవమేనన్నారు. ప్రస్తుతానికి రూ. 100 స్టాంపులు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు.

9 నుంచి ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు

ఏఎస్ పేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 10 సచివాలయాల పరిధిలో ఈనెల 9వ తేదీ నుంచి 13 వరకు ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసన్నకుమారి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు ఈ ప్రత్యేక శిబిరంలో ఆధార్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 9వ తేదీన అనుమసముద్రం, కొండమీద కొండూరు, కుప్పూరుపాడు గ్రామాల వారికి అనుమసముద్రం సచివాలయంలో, 10న ఏఎస్ పేట, గుడిపాడు, చౌటభీమవరం గ్రామాల వారు ఏఎస్‌పేట సచివాలయంలో, 11న జమ్మవరం, గుంపార్లపాడు గ్రామాల వారు జమ్మవరం సచివాలయంలో, 12న రాజవోలు, దూబగుంట, పొనుగోడు గ్రామాల వారు రాజవోలు సచివాలయంలో, 13న శ్రీకొలను, హసనపురం గ్రామాల వారు శ్రీకొలను సచివాలయంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని, మండలంలోని ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్


పిల్లలకు ఫ్లోరోసిస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు



పిల్లలను పరీక్షిస్తున్న ఫ్లోరోసిస్ జిల్లా అధికారిణి దివ్య

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తెడ్డుపాడు, కొత్తపేట, నర్రవాడ సచివాలయాల పరిధి గ్రామాల్లోని పిల్లలకు శుక్రవారం జిల్లా ఫ్లోరోసిస్ అధికారిణి డాక్టర్ దివ్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఫ్లోరోసిస్ వ్యాధి ఉన్నట్లు అనుమానం గల పిల్లలను పూర్తిస్థాయిలో పరీక్షించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఫ్లోరోసిస్‌తో బాధపడే వారికి తగిన వైద్యసేవలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారి హరీష్, ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, ల్యాబ్ టెక్నిషియన్ అనిత, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'భలే జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్, ఫయాజ్ తదితరులు

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీనియర్ జర్నలిస్టు షేక్ ఫయాజ్ రచించిన భలే జ్ఞాపకాలు పుస్తకాన్ని శుక్రవారం స్థానిక చైతన్య ఐటీఐ కళాశాల ఆవరణలో రచయిత ఫయాజ్‌తో కలిసి డాక్టర్ వేణుగోపాల్, స్థానికులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఫయాజ్ రచించిన భలే జ్ఞాపకాల పుస్తకంలో ఎన్నో మంచి విషయాలు ఉన్నాయన్నారు. అనంతరం రచయిత ఫయాజ్ పుస్తక ఆవిష్కరణకు గల కారణాలను వివరించారు. ఇటీవల నవ్వుల మాంత్రికుడు, రక్తకన్నీరు నాగభూషణంలాంటి పుస్తకాలను రచించి సినీ నటులు రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అహ్మద్‌బాషా, ఖాదర్‌బాషా, షేక్‌ఎండీ ఖాజా, దస్తగిరి అహ్మద్, తాజుద్దీన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మహిళకు తీవ్ర గాయాలు



గాయపడ్డ మహిళను వైద్యశాలకు తరలిస్తున్న పోలీసులు



ప్రమాదానికి కారణమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉదయగిరి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ మహిళ కాలుజారి విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ మీద పడడంతో తీవ్ర గాయాలకు గురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన రాగిపాటి నరసమ్మ పట్టణంలోని పలు నివాసాల్లో పాచిపని చేసి సాయంత్రానికి స్వగ్రామానికి చేరుకుంటుంది. ఈనేపథ్యంలో శుక్రవారం సైతం ఓ నివాసంలో పనిచేసి స్వగ్రామానికి వెళ్లేందుకు ఆనకట్ట మీదుగా నడుచుకుంటూ బస్టాండ్‌కు వెళుతోంది. ఈక్రమంలో గుంతలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వచ్చేసరికి కాలుజారి దానిపై పడింది. దీంతో మంటలు చెలరేగడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని నరసమ్మను బయటకు తీసి చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. నరసమ్మ కుమార్తె శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే : ప్రజల ఆగ్రహం

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్ట సుందరీకరణ పనుల్లో భాగంగా కట్ట ఏర్పాటు చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ దిగువకు చేరింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని, మార్చాలని పలుమార్లు పట్టణ ప్రజలు విద్యుత్ శాఖాధికారులు, సిబ్బందికి సూచించినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించలేదని సాకులు చెపుతూ కాలయాపన చేస్తూ వచ్చారన్నారు. మూగజీవాలు కూడా మృత్యువాత పడుతున్నాయని, త్వరితగతిన ట్రాన్స్‌పార్మర్‌ను మార్చాలని ప్రతిరోజు ఆనకట్టపై వాకింగ్ చేసే వారు సైతం సోషల్ మీడియా వేదికగా సూచించినా విద్యుత్ శాఖాధికారులు పెడచెవిన పెట్టడంతోనే ఈ ఘటన చోటుచేసుకుందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సుందరయ్య కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని ఇస్కాన్ సిటీకి చెందిన చెంచయ్య(28) బైక్‌పై గురువారం అర్ధరాత్రి బుజబుజ నెల్లూరులో స్నేహితుడిని వదిలిపెట్టి జాతీయ రహదారి మీదుగా ఇంటికి బయలుదేరాడు. సుందరయ్య కాలనీ సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సౌత్‌ట్రాఫిక్ ఎస్‌ఐ మాల్యాద్రి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలిం చారు. చెంచయ్య అన్న రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ కళ్లలో కారం కొట్టి బంగారు గొలుసు చోరీ

సంగం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జండాదిబ్బ గ్రామంలో పొలం పక్కన గ్రావెల్ రోడ్డులో ఒంటరిగా ఉన్న మహిళ కళ్లల్లో కారం కొట్టి మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలక్ష్మమ్మ అనే మహిళ తన పొలంలో కలుపు తీయించింది. కూలీలు వెళ్లిపోగా ఒక్కటే పొలం పక్కనే ఉన్న గ్రావెల్ రోడ్డుపై కూర్చొంది. ఈక్రమంలో గుర్తుతెలియని యువకుడు వెనుకనే వచ్చి ఆమె కళ్లలో కారం కొట్టి మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈమేరకు సంగం పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

● 31 బైకుల స్వాధీనం



అనుమానితుల వేలిముద్రలు పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న బుజ్జమ్మ రేవు ప్రాంతంలో శుక్రవారం పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. స్పెషల్ పార్టీలతో కలిసి నగర డీఎస్పీ సింధు ప్రియ, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు, ఎస్‌ఐలు, సుమారు 50 మంది పోలీసులు కలిసి 500 ఇళ్లు తనిఖీ చేశారు. అనుమానితుల వేలిముద్రలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని 31 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు ఆకతాయిలను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్డన్ సెర్చ్‌కు ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు. దొంగతనాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు.

యువకుడి నిజాయితీకి పోలీసు సత్కారం

పొదలకూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి నిజాయితీని గుర్తించిన పోలీసులు శుక్రవారం అతడిని సత్కరించారు. వివరాలిలా ఉన్నాయి.. గత బుధవారం స్థానిక పంచాయతీ బస్టాండ్‌లో మోటారుబైక్ కవర్‌లో ఉంచిన రూ.86వేల నగదు చోరీకి గురైంది. దీంతో బాధితుడైన పొదలకూరు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈనేపథ్యంలో పట్టణానికి చెందిన సురేష్ అనే యువకుడు శుక్రవారం తన ఇంటి సమీపంలోని చెత్తకుప్పలో నగదు ఉన్న కవరు దొరికిందని పోలీసులకు అప్పగించాడు. కవర్‌లో రూ.86వేల నగదుతో పాటు బ్యాంకు పాస్ పుస్తకం, పాన్‌కార్డులు ఉన్నాయి. దొరికిన సొమ్మును నిజాయితీగా పోలీసులకు అప్పగించిన యువకుడిని స్థానిక ఎస్‌ఐ షేక్ మహమ్మద్ హనీఫ్ సత్కరించారు. అలాగే వెయ్యి రూపాయలు యువకుడికి అందజేశారు.



యువకుడిని సన్మానిస్తున్న ఎస్‌ఐ



కావలి ప్రాంతీయ వైద్యశాల

» బాధ్యతల నిర్వహణకు సీనియర్ డాక్టర్ నిరాకరణ
» ఆసక్తి చూపుతున్న మాజీ ఆర్ఎంవో
» సీనియార్టీ లేదని యూనియన్ నేత అభ్యంతరం
» కావలి ఏరియా ఆసుపత్రిలో వైద్యుల మధ్య విభేదాలే కారణం

వివాదాల సుడిలో

ఆర్ఎంవో సీటు!

కావలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కావలి ఏరియా ఆసుపత్రిలో ఆర్ఎంవో సీటు వివాదాల సుడిగుండంలో నలుగుతోంది. ఇక్కడ వైద్యుల మధ్య నెలకొన్న విభేదాల కారణంగా నిబంధనల ప్రకారం ఆర్ఎంవో బాధ్యతలు నిర్వర్తించాల్సిన సీనియర్ వైద్యుడు నిరాకరిస్తుండగా ఆ సీటులో కూర్చుని బాధ్యతలు నిర్వర్తించడానికి గతంలో ఆర్ఎంవోగా పనిచేసిన ఓ వైద్యురాలు ఆసక్తి చూపుతున్నారు. అయితే నిబంధనల మేరకు ఆమె కంటే సీనియార్టీ ఉన్న వైద్యులకు ఆ బాధ్యతలు అప్పగించాలి తప్ప సీనియార్టీ లేని ఆమెకు ఎలా అప్పగిస్తారని ఓ యూనియన్ నాయకుడైన మరో వైద్యుడు అభ్యంతరం చెబుతున్నట్లు సమాచారం. సీనియార్టీ ప్రకారం పోస్టింగ్ ఇవ్వాలని వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు సైతం తరచూ ఫిర్యాదులు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆర్ఎంవో నియామకం వివాదాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి వద్ద కూడా పంచాయతీ జరిగినట్లు తెలిసింది. వివరాల మేరకు ఇటీవల వరకు ఇక్కడ ఆర్ఎంవోగా డాక్టర్ ప్రమీల పనిచేశారు. ఈ నేపథ్యంలో అనస్థీషియన్ డాక్టర్ సుబ్బారెడ్డి ఏరియా వైద్యశాలలో విధుల్లో చేరారు. నిబంధనల ప్రకారం అందరికంటే ఆయనే సీనియర్ కావడంతో సీనియార్టీ ప్రకారం ఆయనకు ఆర్ఎంవో ఇవ్వాల్సి ఉంది. అయితే ఆయన తనకు ఆర్ఎంవో పోస్టు వద్దని రాతపూర్వకంగా లేఖ రాసివ్వడంతో డాక్టర్ ప్రమీల ఇటీవల వరకు ఆర్ఎంవోగా కొనసాగారు. అయితే సీనియార్టీలో డాక్టర్ సుబ్బారెడ్డి ఉండగా ఆమెను ఆర్ఎంవోగా కొనసాగించడం ఏమిటని వైద్యశాలలో యూనియన్ నాయకుడిగా కొనసాగుతున్న ఒక డాక్టర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు సుబ్బారెడ్డినే ఆర్ఎంవోగా నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. దీంతో ఆయన విధిలేని పరిస్థితిలో ఆర్ఎంవో బాధ్యతలు స్వీకరించారు. అనస్థీషియన్ డాక్టర్‌గా కొనసాగుతున్న తాను ఎక్కువ సమయం థియేటర్‌లోనే ఉంటున్నందున ఆర్ఎంవోగా తగిన న్యాయం చేయలేనని చెబుతున్నట్లు తెలిసింది. దీంతో మళ్లీ తనకు ఆర్ఎంవో పోస్ట్ వద్దని తాను అనస్థీసియన్ డాక్టర్‌గానే తన విధులు నిర్వహిస్తానని లెటర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అంతర్గతంగా జరిగిన ఒప్పందాల ప్రకారం ఆర్ఎంవోగా డాక్టర్ సుబ్బారెడ్డి ఉంటారని, అయితే అందుకు సంబంధించిన వ్యవహారాలన్నీ డాక్టర్ ప్రమీల చూసుకుంటారని ఒక ఒప్పందానికి వచ్చినట్లు తెలిసింది. అయితే వైద్యశాలలో వైద్యుల మధ్య ఉన్న విభేదాల కారణంగా ఇక్కడ ఏది జరిగినా అది వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు చేరుతుండటంతో దీని వెనుక యూనియన్ నాయకుడు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రికి వచ్చే డబ్బులు పంపిణీ విషయంలో కూడా వైద్యుల మధ్య విభేదాలు వెలుగుచూడడంతో ఒక దశలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అయిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దృష్టికి కూడా వెళ్లింది. ఆయన కూడా వైద్యులతో మాట్లాడి సర్ది చెప్పినా వారి మధ్య అంతర్గత విభేదాలు లోలోపల కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే ఆర్ఎంవో పోస్టింగ్‌లో దోబూచులాట కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఇక్కడ ఆర్ఎంవో పోస్టును ఆశిస్తున్న వైద్యురాలు, యూనియన్ నేతగా వ్యవహరిస్తున్న వైద్యుడు ఇద్దరూ కావలికి చెందిన వారే కావడంతో వారి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతున్నట్లు ఏరియా ఆసుపత్రి సిబ్బంది బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

సూపరింటెండెంట్‌కు ఆర్ఎంవో ఇన్‌చార్జి బాధ్యతలు

వైద్యుల మధ్య ఉన్న విభేదాల నేపథ్యంలో సీనియార్టీ పేరుతో ఆర్ఎంవో పోస్టు వివాదాల సుడిగుండంలో చిక్కుకోవడం, డాక్టర్ సుబ్బారెడ్డి తాను ఆ బాధ్యతలు నిర్వర్తించలేనని రాసివ్వడంతో ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న డాక్టర్ పద్మావతికి ఆర్ఎంవో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.



ప్రజా చైతన్యంతోనే వ్యాధుల కట్టడి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత

కావలిటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గతంతో పోలిస్తే ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరిగి చైతన్యవంతులయ్యారు. దీంతో వ్యాధులు తగ్గుముఖం పట్టాయి. ఎండదెబ్బ (సన్‌స్ట్రోక్) మృతుల కేసు ఒక్కటీ లేకపోవడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. డివిజన్ పరిధిలోని అన్ని పీహెచ్‌సీల్లో కొవిడ్, విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తులను గుర్తిస్తే అందించాల్సి వైద్యం తదితర అంశాల పట్ల మాక్ డ్రైవ్ చేపట్టామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత తెలిపారు.

ఈ ఇంటర్వ్యూలో...

? కావలి డివిజన్‌లో కొవిడ్ కేసులు ఉన్నాయా. కొవిడ్ కేసులు ఉంటే తగిన వైద్యం అందుబాటులో ఉందా.

! ఎక్కడా కొవిడ్ కేసులు నమోదు కాలేదు. కొవిడ్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం. అన్ని పీహెచ్‌సీల్లో మాక్ డ్రైవ్ చేపట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ప్రజలను అప్రత్తం చేశాం. వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉన్నాయి.

? వడదెబ్బ మృతులు ఉన్నాయా.

! ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవడంతో వడదెబ్బ మృతులు లేవు.

? విష జ్వరాల కేసుల ప్రభావం ఎలా ఉంది.

! గతంతో పోలిస్తే విష జ్వరాల కేసులు తక్కువ. వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణ అవగాహన చర్యలతో ఫలితాలు బాగున్నాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 535

న్యూస్ బాక్స్

నేడు మంత్రి ఆనం కందుకూరుకు రాక

కందుకూరు/వలేటివారిపాలెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శనివారం కందుకూరు నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఉదయం 8.30 గంటలకు కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయం వద్ద నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు, అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న షాపింగ్‌కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తారు. 9.45 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని అక్కడ పార్టీ నాయకులతో సమావేశమవుతారని టీడీపీ నాయకులు తెలిపారు. అనంతరం వలేటివారిపాలెం మండలంకు చేరుకుని చుండి- కాకర్లపాలెం గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డును, పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారని ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు పేర్కొన్నారు. కొండపైన రూ.80 లక్షలతో నిర్మించిన 5 వసతి గదులు, రూ.2.40 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్, రూ.77 లక్షలతో నిర్మించిన ఎస్ఎస్ క్యూలైన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అదేవిధంగా కొండ కింద రూ.1.56 కోట్లతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు, రూ.2.65 కోట్లతో నిర్మించనున్న డార్మిటరీ హాలుకు, రూ.46.50 లక్షలతో ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు డీసీ తెలిపారు.

సీతారామస్వామి ఆలయ వార్షికోత్సవం

కందుకూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరు పంచాయతీ పరిధిలోని వలేటివారిపాలెం గ్రామంలో ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమాలలో పాల్గొని వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఆయన వెంట నార్నె రోశయ్య, ఎన్వీ రమణయ్య తదితరులున్నారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

కందుకూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని ముస్లింలకు పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్‌చౌదరి, తూమాటి మాధవరావు, వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మనలోని దాతృత్వాన్ని ప్రదర్శించేందుకు బక్రీద్ గొప్ప అవకాశంగా వారు అభివర్ణించారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

లింగసముద్రం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో యేసుపోగు గ్లోరి, కేసీ అక్షయ, దాసరి ఐజాక్‌లు ఉన్నారని హెచ్ఎం యు మాధవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులకు ప్రతి ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఎంపికైన వారిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాళ్లపాడుకు 1.5 టీఎంసీల సోమశిల జలాలు

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డు పనుల ప్రారంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

లింగసముద్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : వచ్చే వ్యవసాయ సీజన్‌కు సోమశిల జలాశం నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు 1.5 టీఎంసీల నీటిని తీసుకువచ్చి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామం వద్ద రాళ్లపాడు ప్రాజెక్టు ఈఈ జీ.మునిరత్నం, ఆయకట్టు చైర్మన్ ఏలూరి వెంకటేశ్వరరావుతో కలిసి రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ రోడ్డు పనులకు భూమి పూజ చేసి ఎక్స్‌కవేటర్‌ను నడిపి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం సోమశిల ఉత్తర కాలువ వెడల్పు పనులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ ప్రాంతంలోని రైతులకు సాగు, తాగునీటిని అందించే జీవనాడి రాళ్లపాడును రైతుల సహాయ సహకారాలతో కాపాడుకుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాళ్లపాడు ప్రాజెక్టు కాలువల్లో పూడిక, చిల్లచెట్లు తొలగింపునకు రూ.30 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి గుళ్లపాలెం వరకు 20 కి.మీ పొడవున ఉన్న కాలువకు పక్కనే ఉన్న రోడ్డును, ఎడమ కాలువ రోడ్డును, ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా ఉన్న జంగిల్ తొలగింపుకు రూ.75 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు, రైతుల సహాయ సహకారాలతో ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈలు ఎం వెంకటేశ్వర్లు, శేషయ్య, ఏఈ చంద్రమౌళి, నవీన్, మనోహర్, టీడీపీ నాయకులు ఎస్ మనోహర్, ఎంఎల్ఎన్ చౌదరి, ఎం వెంకటేశ్వర్లు, సర్పంచు సీహెచ్ మాధవి, నీటి సంఘాల అధ్యక్షులు యు సుబ్బారావు, మాల్యాద్రి పాల్గొన్నారు.

భద్రతపై బాలికలు అవగాహన పెంపొందించుకోవాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సునీత

వలేటివారిపాలెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : బాలికలు, మహిళలు మోసపోకుండా అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని చుండి అంగన్‌వాడీ ఖన్రకేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమలో సూపర్‌వైజర్ సునీత మాట్లాడుతూ బాలికలు, మహిళలు ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్య వివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళాపోలీస్ జ్యోత్స్న, కార్యకర్తలు రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

● కందుకూరు ఏపీడీ బాబూరావు



పెదపవనిలో ఉపాధి హామీ కూలీల మస్టర్ తనిఖీ చేస్తున్న ఏపీడీ బాబూరావు

లింగసముద్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆ పథకం కందుకూరు ఏపీడీ జే.బాబూరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు, ఏపీవో దయాసాగర్‌తో కలిసి పెదపవనిలో జరుగుతున్న చెరువు, కాలువల పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంటు, మేట్ల మధ్య ఏర్పడిన వివాదాల కారణంగా గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో ఇబ్బందులు ఏర్పడుతుండడంతో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్లను తనిఖీ చేశారు. పనుల్లో అవతవకలు పాల్పడినా, కూలీల వద్ద డబ్బులు వసూలు చేసినా, బోగస్ మస్టర్లు వేసినా వారిని తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. బోగస్ మస్టర్లు వేయనివ్వకుండా గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రత్తయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

● ఉదయగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ ● రూ.1.5 లక్షల అందజేత



రత్తయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి

జలదంకి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ సంస్థ వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న కొమరా రత్తయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి భరోసా ఇచ్చారు. శుక్రవారం వారు మృతుడి స్వగ్రామం మండలంలోని చామదల పంచాయతీ వేణుగోపాలపురం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రత్తయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులతో ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చిన ఎమ్మెల్యే కాకర్ల తన ట్రస్ట్ నుంచి రూ.50 వేల అందజేయగా, గౌడ సంఘం తరుపున రూ.75వేలు, తన స్వొంత నిధులు రూ.25వేలు కలిపి రూ.లక్ష చైర్మన్ వీరంకి అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వారి ఆగడాలు తాళలేక తీవ్ర ఒత్తిడికి లోనై గీత కార్మికుడు రత్తయ్య కలిగిరి మండలం బట్టువారిపాలెంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఫైనాన్స్ కంపెనీపై రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. వీరి వెంట మండల టీడీపీ, తెలుగుయువత అధ్యక్షులు పి.మధు మోహన్‌రెడ్డి, ఎం.తిరుమలరెడ్డి, నాయకులు పి.భాస్కర్‌రెడ్డి, గౌడసంఘం నాయకులు వంశీ, శ్రీను, వెంకట్రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించండి

● కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



అధికారులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

కొండాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ఆక్రమణదారులకు నోటీసుల అందజేసి తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అధికారులను ఆదేశించారు. మండలంలోని సాయిపేటలో సర్వే నెంబరు 586-1 ప్రభుత్వ భూమిలో కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు అందడంతో శుక్రవారం గ్రామంలో ఆమె పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు పాల్పడినవారికి నోటీసులు అందజేసి నిర్మాణాలను తొలగింపజేసి స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కోటేశ్వరరావు, వీఆర్వో శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



లింగసముద్రం జడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

లింగసముద్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో 1994-95 నుంచి 1998-99 విద్యా సంవత్సరాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ముందుగా తమకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను మెమొంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా వారు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు యు మాధవరావు, కె సూర్యప్రకాశరావు, పూర్వ విద్యార్థులు నాయుడు మహీధర్, బి ఓంకారం, కె చిరంజీవి, యు చినబ్రహ్మయ్య, ఏ సురేష్, జి మాధవ, ఎం బాలు, కృష్ణవేణి, జయసుధ, శారద, అమరావతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల్లో గందరగోళం

(5వ పేజీ తరువాయి)

గణితం, పీఎస్, బీఎస్, సోషల్ టీచర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల చేశారు. అనంతరం లాంగ్వేజెస్‌లో తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం టీచర్ల బదిలీ ఉత్తర్వులు కూడా విడుదల చేసి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అధికారికంగా డౌన్‌లోడ్ చేశారు. అయితే ఈ ఉత్తర్వులు వెలువడిన తరువాత ఎస్ఏలు తమకు అన్యాయం జరిగిందంటూ విద్యాశాఖ కార్యాలయం ఎదుట బైఠాయించారు.

● టీచర్ల ఆందోళన

స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు వెబ్‌ఆప్షన్ల ద్వారా విడుదల అయిన బదిలీ ఉత్తర్వుల్లో అవకతవకలు జరిగాయంటూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. నగరంలోని డీఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం జరిగిన ఈ ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు ఎం.సురేంద్రరెడ్డి మాట్లాడారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం నుంచి ప్రహసనంగా మారిందని, పాయింట్ల కేటాయింపుల్లో ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. బదిలీలపై జరిగిన అవకతవకలపై విచారణ చేసి సీనియర్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకల వెబ్‌ఆప్షన్ల విధానానికి స్వస్తి పలికి ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఈ ఆందోళనలో ఏపీటీఎఫ్ నేతలు పిచ్చిబాబు, జుల్ఫికర్ అలీ, రియాజ్, వెంకటేశ్వర్లు, గురవయ్య, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమేష్, వెంగబాబు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ



రోళ్లపాడు గ్రామంలోకి నూతనంగా నిర్మించిన తారురోడ్డు

వలేటివారిపాలెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంగా కారణంగా గ్రామీణ రోడ్లు మరమ్మతులకు కూడా నోచుకోక జనం రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే గ్రామీణ రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. అందులో బాగంగానే మండలంలోని పోకూరు నుంచి శింగమనేనిపల్లెకు ఉపాధి నిధులు రూ 1.50 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేసింది. అదేవిధంగా కళవళ్ల నుంచి లింగసముద్రం మండలం వీఆర్‌కోటకు ఉపాధి నిధులు రూ.2 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పనులు పూర్తయ్యాయి, అదేవిధంగా వలేటివారిపాలెం నేషనల్‌హైవే నుంచి రోళ్లపాడు గ్రామంలోకి ఉపాధి నిధులు రూ. 1.50 కోట్లతో తారురోడ్డు పనులు పూర్తి చేశారు. అలాగే జాతీయ రహదారి నుంచి కొండసముద్రం గ్రామంలోకి ఉపాధి నిధులు రూ.1.50 కోట్లతో తారురోడ్డు పనులు జరుగుతున్నాయి. ఆ గ్రామీణ రోడ్లు గత ఐదేళ్లలో కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఆ రోడ్లపై ఎక్కడికక్కడ మోకాటిలోతు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. అయితే కూటమి ప్రభుత్వంలో ఆ రోడ్లకు కొత్తగా తారు వేయడంతో రహదారులు కొత్త అందాలను సంతరించుకొని కళకళలాడుతున్నాయి. తమ గ్రామాలకు వెళ్లే రహదారులు రూపురేఖలు మారిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్ల బాగుకు నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పది రోజుల్లో నీటి సరఫరానే లక్ష్యం : డీఈ

బిట్రగుంట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): శిక్షణ కేంద్రం విద్యార్థుల అవసరార్థం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పది రోజుల్లో నీటి సరఫరా లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ అన్నారు. బోగోలు మండలం కప్పరాళతిప్పలోని స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో మంచినీటి సమస్య పరిష్కారం కోసం కొత్త పైపులైన్ ఏర్పాటు ప్రాంతాన్ని జేఈ రవీంద్రనాథ్‌తో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట బీఎంఆర్ వాటర్ ప్లాంట్ సమీపం నుంచి ఏకలవ్య కాలనీ మీదుగా ట్రయినింగ్ సెంటర్ వరకు దాదాపు 1200 మీటర్ల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సమస్య విషయం ఎమ్మెల్యే జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో ఐటీడీఏ ప్రత్యేక నిధులు రూ.5.50 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, అల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పురుషోత్తం, బోగోలు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అజయ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈ లీలాప్రకాష్

కదలరు.. వదలరు!

ఏళ్ల కొద్దీ ఒకే ప్రాంతంలో తిష్ట

ప్రభుత్వం మారినా కొనసాగుతున్న వైనం

జిల్లా రెవెన్యూలో ఇదీ సంగతి

ఈ బదిలీల్లోనైనా కదిలిస్తారా?



ప్రభుత్వం ఏదైనా సరే, వాళ్ల అధికారానికి ఢోకా లేదు. ఆయా పార్టీల నేతలను ప్రసన్నం చేసుకుని ఆయా పోస్టుల్లోనే ఇన్‌చార్జులుగా కొనసాగుతున్నారు. బదిలీ జరిగినా డిప్యుటేషన్‌పై కోరుకున్న చోటే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంకొందరికైతే ఆయా ప్రాంతాల్లో.. పక్కపక్క మండలాలకే బదిలీ అవుతుండటం గమనార్హం. ఈ బదిలీల్లోనైనా వీరికి స్థానచలనం కలుగుతుందా అనేది చూడాలి.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

వీరికి బదిలీలు ఉండవా?

జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లు 97మంది పనిచేస్తున్నారు. వీరిలో సుమారు 30శాతం మంది ఏళ్ల తరబడి ఆయా మండలాల్లోనే తిష్టవేశారు. మచ్చుకు కొందరిని పరిశీలిస్తే..

● తిరుపతిలో ఓ సీఎస్‌డీటీ సుమారు 12 ఏళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారు. ఆయన్ను పలుమార్లు వేరే మండలాలకు బదిలీచేసినా రాజకీయ నేత సిఫార్సుతో తిరిగి ఇక్కడికే డిప్యూటేషన్‌పై వస్తున్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఆయన హవా సాగిపోతోంది.

● తిరుపతిలోనే వీఆర్వోగా మొదలై ఇప్పుడు డీటీ వరకు సుమారు 15 ఏళ్లుగా పనిచేస్తున్నారో అధికారి. ఏ ప్రభుత్వం వచ్చినా ఆయనకు ఇబ్బంది లేదు. ఈయన కుమారుడు రాజధానిలో సీఎం తర్వాత స్థానంలో ఉన్న వ్యక్తి వద్ద ఓఎస్డీగా పనిచేస్తుండటంతో ఈయన్ను బదిలీ చేయడానికి అధికారులు సాహసించడంలేదు.

● చంద్రగిరి నియోజకవర్గంలోని ఓ సీఎస్ డీటీ.. చిట్టమూరులో ఒక డీటీ ఏళ్ల తరబడి అక్కడే పనిచేస్తున్నారు.

● సూళ్లూరుపేట నియోజకవర్గంలో తీరప్రాంతానికి చెందిన మండలంలో ఓ డీటీ దీర్ఘకాలికంగా పనిచేస్తున్నారు. అక్కడి నేతల సహకారంతో ఇన్‌చార్జి తహసీల్దారుగానూ బాధ్యతలు నిర్వరిస్తున్నారు. ఇదే నియోజకవర్గంలో మరో కీలకమైన మండలానికి ఓ డీటీ వైసీపీ ప్రభుత్వంలోను, ప్రస్తుత ఇన్‌ఛార్జి తహసీల్దారుగా పనిచేస్తుండటం గమనార్హం. అదే నియోజకవర్గానికి చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బంధువు గత ప్రభుత్వంలో తహసీల్దారుగా పనిచేశారు. ప్రభుత్వం మారినా తిరిగి రెవెన్యూ హెడ్‌క్వార్టర్‌లో కీలక పోస్టులో ఉన్నారు.

● గూడూరు కేంద్రంలోని ఓ డీటీ సుదీర్ఘంగా అక్కడే పనిచేస్తున్నారు. గూడూరు రెవెన్యూ డివిజన్‌లో మూడు మండలాలకు ఇన్‌చార్జి తహసీల్దార్లుగా డీటీలు కొనసాగుతున్నారు. సూళ్లూరుపేట డివిజన్‌లోని రెండు మండలాల్లోనూ ఇదే పరిస్థితి.

వీఆర్వోల పరిస్థితికి వస్తే మరీ దారుణం

జిల్లాలో సుమారు 370 మంది వీఆర్వోలు ఉన్నారు. ఏళ్ల తరబడి జిల్లాకేంద్రానికి సమీపంలోనే గ్రామీణ మండలాల్లో పనిచేస్తున్నారు. తిరుపతి రూరల్ మండలంలోనే ఏళ్ల కొద్దీ పదిమంది వీఆర్వోలు తిష్టవేసుకుని కూర్చున్నారు. కొందరు వీఆర్వోలు ఐదేళ్లకు ఒకసారి క్లస్టర్ లేదా గ్రామం మారుతున్నారు తప్ప దూరమండలాలకు వెళ్లిన దాఖలాలు లేవు. దీంతో దూరప్రాంతాల్లోని వీఆర్వోలు దగ్గర మండలాలకు వచ్చే పరిస్థితి కనపడటం లేదు.

ఈ అధికారుల మాటేమిటి?

● పర్యాటక శాఖలో పనిచేసే ఓ అధికారికి కడపలోని వైసీపీ నేతలతో బంధుత్వముంది. దీంతో గత ఐదేళ్లు ఇక్కడే ఉన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఓ ప్రభుత్వ న్యాయవాది పలుకుబడితో పర్యాటక శాఖతో పాటు మరో రెండు పోస్టుల్లో కొనసాగుతున్నారు. ఇతడి వ్యవహార శైలి, తీరుపై ఒకశాఖలోని ఉద్యోగులు ఇటీవల రాజధానికి వరుస ఫిర్యాదులు చేశారు.

● గత ప్రభుత్వంలో మాజీ మంత్రి అండదండలతో దేవదాయశాఖలో పనిచేసే ఓ అధికారి ఇప్పటికీ జిల్లాలో కొనసాగుతున్నారు. దేవదాయశాఖ, మఠం భూములు కబ్జా అవుతున్నా పట్టించుకోకపోవడంపై ఆరోపణలు ఉన్నాయి.

● ఇక పౌరసరఫరాల శాఖలో గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న ఓ అధికారిపైనా ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రాజధానికి వెళ్లి పైరవీ చేసి తిరిగి పోస్టు తెచ్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకా ఇలాంటి వారెందరో ఉన్నారు.


పంచాయతీల్లో..

జిల్లాలో 774 గ్రామ పంచాయతీలను జనాభా, ఆదాయాన్ని బట్టి వర్గీకరణకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ కసరత్తు పూర్తయి ప్రభుత్వానికి నివేదికలుకూడా వెళ్లాయి. అయితే గ్రేడ్‌తో పనిలేకుండా మేజర్‌పంచాయతీలకు రావడానికి రాజకీయ నేతల నుంచిజిల్లా యంత్రాంగంపై పలువురు ఒత్తిడి తెస్తున్నారు.

ఎల్లుండితో బదిలీల గడువు పూర్తి

ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును ప్రభుత్వం సోమవారం వరకు పొడిగించింది. మంగళవారం నుంచి మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. ఈ క్రమలంలో అనువైన చోట పోస్టింగ్‌కు పలువురు తహసీల్దారు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కడుతున్నారు. వైసీపీతో అంటకాగిన అధికారుల్లో పలువురు ఇంకా కీలక స్థానాల్లో పనిచేస్తున్నారు. ఇక, తిరుపతి అర్బన్, ఎర్రావారిపాళెం, కేవీబీపురం, పాకాల, వెంకటగిరి, చిల్లకూరు, నాయుడుపేట మండలాలకు తహసీల్దారు పోస్టుల కోసం తీవ్ర పోటీ నెలకొంది.

■ వెల్‌డన్ **భాను**



● శ్రీకాళహస్తి విద్యార్థికి సీఎం ప్రశంస

శ్రీకాళహస్తి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లికి చెందిన భానుచరణ్‌రెడ్డిని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఇతడికి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 51వ ర్యాంకు వచ్చింది. విజయవాడలో శుక్రవారం భానుచరణ్‌ను సీఎం సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే రాష్ట్ర మంత్రి నారాయణ కూడా అతడిని అభినందించారు.

స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లకు
పోటెత్తిన భక్తులు



భూదేవి కాంప్లెక్సులో



శ్రీనివాసం వద్ద క్యూలలో భక్తులు

తిరుపతిలో జారీ చేసే శ్రీవారి స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్ల కోసం భక్తులు పోటెత్తారు. టోకెన్లు జారీ చేసే కేంద్రాల వద్ద శుక్రవార భారీగా రద్దీ నెలకొంది. అలిపిరి భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసం కౌంటర్ల వద్దనున్న క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. రద్దీ పెరిగిన నేపథ్యంలో సాయంత్రం నుంచే శనివారానికి సంబంధించిన టోకెన్లను జారీ చేశారు. దీంతో మధ్యాహ్నం నుంచే భక్తులు ప్రవేశించడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. టీటీడీ పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి తోపులాట, తొక్కిసలాటలకు తావులేకుండా భక్తులు టోకెన్లు పొందారు.

తిరుమలలో పెరిగిన రద్దీ : ఇక, తిరుమలలోనూ భక్తుల రద్దీ పెరిగింది. వారాంతం.. వేసవి సెలువులు ముగింపు దశకు రావడంతో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, రాంభగీచ, లేపాక్షి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూకాంపెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండి.. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 15 గంటల తర్వాత శ్రీవారి దర్శనం లభిస్తోంది. టైంస్లాట్ టోకెన్లు, టికెట్లున్న భక్తులకూ మూడు గంటలు పడుతోంది. గదులు కేటాయించే సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి కౌంటర్లు.. కల్యాణకట్టల వద్దా రద్దీ నెలకొంది. ఎక్కువ మంది భక్తులు సొంత వాహనాల్లోనే రావడంతో అలిపిరి చెక్‌పాయింట్ రద్దీ కనిపించింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మూడు 'విండో'లకు పీఐసీల మార్పు

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మూడు సింగిల్ విండోలకు అఫిషియల్ పర్సన్ ఇంఛార్జి కమిటీ (పీఐసీ)లను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిప్పగుంటపాలెం, కురుగొండ, దామానెల్లూరు సింగిల్ విండోలకు గతేడాది డిసెంబరు నుంచీ సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ ఇలియాజ్ అఫిషియల్ పర్సన్ ఇంఛార్జిగా కొనసాగుతున్నారు. ఆయన ఇటీవల సెలవు పెట్టడంతో ఆ స్థానంలో ఈ మూడు సింగిల్‌విండోలకు వేర్వేరుగా అఫిషియల్ పర్సన్ ఇంఛార్జులు నియమితులయ్యారు. తిప్పగుంటపాలెం విండోకు గూడూరు జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం.అర్కినాథన్, కురుగొండ విండోకు వెంకటగిరి జూనియర్ ఇన్‌స్పెక్టర్‌పి.నజ్రీన్, దామానెల్లూరు విండోకు గూడూరు జూనియర్ ఇన్‌స్పెక్టర్ పి.మహేష్‌సింగ్‌ను పర్సన్ ఇంఛార్జులుగా నియమించారు.

ఎల్‌ఏ అథారిటీ ప్రిసైడింగ్ అధికారిగా అన్వర్

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ అక్విజేషన్, రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్‌మెంట్ తిరుపతి ప్రాంతీయ అథారిటీకి ప్రిసైడింగ్ అధికారిగా జి.అన్వర్ బాషా నియమితులయ్యారు. ప్రజాహిత కార్యక్రమాలకు ప్రభుత్వం భూములు సేకరించే క్రమంలో రైతులు, యజమానులకు న్యాయమైన పరిహారం అందించడానికి, పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం రాయలసీమ జిల్లాలకు కేంద్రంగా తిరుపతిలో ప్రాంతీయ అథారిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ అథారిటీకి తొలి ప్రిసైడింగ్ అధికారిగా నియమితులైన రిటైర్డు జిల్లా జడ్జి వెంగయ్య వయోపరిమితి దాటిన కారణంగా 2023 ఆగస్టులో ఈ పోస్టు నుంచి వైదొలిగారు. ఆ స్థానంలో యు.సత్యారావు ఎఫ్ఏసీగా కొనసాగుతున్నారు. తాజాగా ప్రభుత్వం రిటైర్డు జిల్లా జడ్జి జి.అన్వర్ బాషాను నియమించింది.

సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా విక్రమ్

తిరుపతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా జే.విక్రమ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన తాజా బదిలీలలో భాగంగా చిత్తూరు జిల్లా డీడీగా బదిలీ అయ్యారు. దానితో పాటు తిరుపతి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు.

మెగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

● 4 కేంద్రాల్లో 1,017 మంది హాజరు

తిరుపతి(విద్య), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ-2025 పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 30వ తేదీ వరకు 26 రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయి. తిరుపతి అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, పుత్తూరు శ్రీవేంకటేశ పెరుమాళ్, గూడూరు నారాయణ, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలు కేంద్రాలుగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు జరిగాయి. గంటన్నర ముందునుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. గుర్తింపు కార్డు ఉన్న వారిని మాత్రమే లోనికి పంపారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, స్టడీ మెటీరియల్‌ను అనుమతించలేదు.



తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ సెంటర్‌లో అభ్యర్థులను తనిఖీ చేసి అనుమతిస్తున్న సిబ్బంది

126మంది గైర్హాజరు

జిల్లాలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఉదయం 573 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 64 మంది గైర్హాజరయ్యారు. 509 మంది రాశారు. మధ్యాహ్నం సెషన్‌లో 570 మందికి గాను 508 మంది పరీక్షలు రాయగా 62 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ వెంకటేశ్వర్ డీఈవో కేవీఎన్ కుమార్‌తో కలసి తిరుపతిలోని కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, సౌకర్యాలను పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. డీఎస్సీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, కేంద్రాల వద్ద అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

9న షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం

● టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అవార్డులు

● హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి

తిరుపతి(విద్య), జూన్ 6(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పేరుతో అవార్డులను ప్రదానం చేస్తోంది. జిల్లాకు సంబంధించి ఈ కార్యక్రమం సోమవారం మహతి ఆడిటోరియంలో జరుగనుంది. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు. రూ.20 వేల చెక్, మెడల్, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారు. పదవ తరగతి విద్యార్థులకు సంబంధించి మండలానికి ఆరుగురు చొప్పున ఎంపిక చేశారు. మొత్తం 207 మంది ఎంపికయ్యారు. ఇంటర్ విద్యలో అత్యధిక మార్కులు సాధించిన 40 మందిని ఎంపిక చేశారు.

రిసెప్షన్ కేంద్రాలకు నూతన సొబగులు

● పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులకు వసతులు కల్పించేలా చర్యలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతి పోలీసు స్టేషన్‌కు రిసెప్షన్ కేంద్రం ఉండాలి. ఇక్కడ ఫిర్యాదుదారులకు వసతులు కల్పించాలి. ఈ దిశగా గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు చర్యలు చేపట్టారు. ఆ తర్వాత ప్రభుత్వాలు వీటిని పట్టించుకోలేదు. వీటిని అన్ని వసతులతో ఫిర్యాదుదారులకు అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పోలీసు స్టేషన్ల వద్ద ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ కేంద్రాలలో సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రధానంగా ఆర్వో వాటర్ సౌకర్యం, విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నిచర్, టీవీ తదితరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ దిశగా జిల్లాలో చర్యలు చేపట్టారు. ఇప్పటికే తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రాన్ని అన్ని వసతులతో తీర్చి దిద్దుతున్నారు. కాగా, తిరుపతి రూరల్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు చెట్ల కింద కూర్చోవాల్సిన పరిస్థితి ఉండేది. దీన్ని గమనించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెంటనే రిసెప్షన్ కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్ తరహాలో అన్ని చోట్ల రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా, గతంలో టీడీపీప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాలు.. మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. మళ్లీ ఇప్పుడు ఇవి పూర్వ వైభవంతో అందుబాటులోకి రానున్నాయి. కాగా, పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులకు ప్రాధాన్యమిచ్చి వారిని రిసెప్షన్ కేంద్రాల్లో కూర్చోబెట్టి.. సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.



తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రం

ముగిసిన ఎస్జీటీల పదోన్నతి కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్,జూన్6 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీల) పదోన్నతి కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. స్థానిక డీఈవో కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన ఈ ప్రక్రియ సాగింది. ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతికి 273 ఖాళీలను విద్యాశాఖ అధికారులు గుర్తించారు. వీటిల్లో.. జడ్పీ యాజమాన్యంలో 106, ప్రభుత్వ యాజమాన్యంలో ఒకటి, మున్సిపల్ కార్పొరేషన్‌లో 54, మున్సిపాలిటీ యాజమాన్యం పాఠశాలల్లో 112 ఖాళీలు ఉన్నాయి. ఇందు కోసం 1:3 రేషియోలో 819 ఎస్జీటీలను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సీనియారిటీ జాబితా ఆధారంగా ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రాత్రి వరకు కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు చేపట్టారు. శనివారం నుంచి సీనియారిటీ జాబితా ఆధారంగా ఎస్జీటీలకు బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది.





నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి - విజయదుర్గ

శ్రీవారి సేవలో మాజీ సీఎం నల్లారి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి సోదరి, నటుడు సాయిధరమ్‌తేజ్ తల్లి విజయదుర్గ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. కాగా దర్శనానికి ముందు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సుప్రభాత సేవలో విజయేంద్ర సరస్వతి



కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మఠం ఉత్తరాధికారి సత్యచంద్రశేఖరేంద్ర సరస్వతితో కలిసి శ్రీవారి ఆలయంలో వేకువజాము జరిగిన సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం తర్వాత శ్రీవారి పుష్కరిణిని సందర్శించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ సర్కిల్ ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.34 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,284

తలనీలాలు సమర్పించినవారు: 31,268

రేపటి నుంచి యూపీఎస్సీ ఇంజనీరింగ్ పరీక్షలు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ పరీక్షలు(ప్రిలిమనరీ) ఆదివారం నుంచి నిర్వహించనుండడంతో డీఆర్వో నరసింహులు శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. నగరంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో 791మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అందుకు తగినట్లు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. పేపర్ 1 ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని, అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని అన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు.

తిరుపతిలో మత్తు ఇంజెక్షన్ల కలకలం

- ఆగమేఘాల మీద ఘటనా స్థలం పరిశీలన
- అంతా ఫేక్ అని తేల్చిన పోలీసులు



కూరాయల మార్కెట్‌లో వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం మత్తు ఇంజెక్షన్లు వున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలతో కలకలం రేగింది. దీనిపై ఎస్పీ హర్షవర్ధన రాజు సీరియస్‌గా స్పందించారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం, ఎస్బీ సీఐ షాదిక్ అలీ, పోలీసులతో కలసి ఘటనా స్థలానికి వచ్చి చుట్టు పక్కల ప్రాంతాలు, మత్తు ఇంజెక్షన్లు వున్నట్లు వచ్చిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. దాదాపు 40 నిమిషాల పాటు అక్కడే ఉండి కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు, కొనుగోలుదారులతో మాట్లాడారు. ఎవరికైనా మత్తు ఇంజెక్షన్లు కనపడ్డాయా? ఎవరనా చూశారా అని అడిగారు. అయితే వైరల్ అయిన వీడియోను పరిశీలించిన ఎస్పీ అది ఇప్పటిది కాదని తేల్చారు. కానీ భవిష్యత్తులో కూరగాయల మార్కెట్‌లో నిషేధిత వస్తువులు, మత్తు ఇంజెక్షన్లు, మాదక ద్రవ్యాల ఉనికి కనపడకుండా ఉండడానికి వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ పటిష్టమైన గస్తీ ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆదేశించారు. ఎక్కడైనా ఇలాంటి ఘటనలు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 112 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 6(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా అధికారులు ఆకాంక్షించారు. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకుని వారు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శన టోకెన్ల జారీ



దివ్యదర్శనం టోకెన్లు పొందుతున్న శ్రీవారి మెట్టు కాలిబాట భక్తులు

తిరుమల, జూన్6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన వెళ్లే భక్తులకు శుక్రవారం సాయంత్రం నుంచి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌లో దివ్యదర్శన(డీడీ) టోకెన్ల జారీని టీటీడీ ప్రారంభించింది. ఈసందర్భంగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారిమెట్టు దివ్యదర్శన టోకెన్ కేంద్రాన్ని శ్రీవారిమెట్టు నుంచి భూదేవి కాంప్లెక్స్‌కు మార్చడంపై భక్తుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. శ్రీనివాస మంగాపురం ఆలయంలో కౌంటర్ల ఏర్పాటుకు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతున్న క్రమంలో భక్తుల సౌకర్యార్థం టోకెన్ కౌంటర్లను తాత్కాలికంగా భూదేవి కాంప్లెక్స్‌కు మార్చామన్నారు. భూదేవి కాంప్లెక్స్‌లో ఇప్పటికే పూర్తిస్థాయిలో ఎస్ఎస్‌డీ(స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్లు జారీ చేసే మౌలిక సదుపాయాలు ఉండటంతో డీడీ టోకెన్ల జారీని ప్రారంభించామన్నారు. శ్రీవారిమెట్టు డీడీ టోకెన్ల జారీ చేయడానికి నాలుగు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని, టీటీడీ ఏర్పాట్లపై భక్తులు కూడా ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. రవాణా వ్యవస్థ కూడా బాగా ఉందని, బస్టాండ్ కూడా అలిపిరిలోనే ఉందన్నారు. దీంతో భక్తులు శ్రీవారిమెట్టుకు చేరుకోవడానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు శ్రీవారి సేవా వలంటీర్లతో పాటు పరిపాలన నిఘా, అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించామన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా డీడీ టోకెన్లు జారీ చేసేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యదర్శన టోకెన్లను పరిశీలిస్తున్న అదనపు ఈవో

చెవిరెడ్డీ.. లిక్కర్ స్కామ్‌లో నీ పాత్ర ఏంటో

సిట్ దర్యాప్తులో తేలుతుంది

- వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేయడం నీ నైజం
- కక్ష సాధింపు కాదు.. మీ అవినీతిపై చట్టపరంగానే చర్యలు
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



సమావేశంలో మాట్లాడుతున్న పులివర్తి నాని

తిరుపతి(జీవకోన), జూన్ 6(ఆంధ్రజ్యోతి): చెవిరెడ్డీ.. లిక్కర్ స్కామ్‌లో నీ పాత్ర ఏంటో సిట్ దర్యాప్తులో తేలుతుందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. నీ గన్‌మేన్ గిరిని బెదిరించి తప్పుడు స్టేట్‌మెంట్లు ఇవ్వమన్నారంటూ హడావిడి చేయడం.. గుమ్మడి కాయల దొంగ భుజాలు తడుముకున్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. సానుభూతి, పబ్లిసిటీ కోసం ముందస్తుగానే ఇలాంటివి చేయడం సరికాదన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కసిరెడ్డితో స్నేహం లేకపోతే టీటీడీ బోర్డుకు ఆయన పేరు ఎందుకు సిఫార్సు చేశావంటూ ప్రశ్నించారు. 'నీపై 87కేసులు పెట్టారంటూ చెబుతున్నావు. అవన్నీ టీడీపీ ప్రభుత్వంలో కాదు.. కాంగ్రెస్ హయాంలో పెట్టినవే. వైసీపీ ప్రభుత్వంలో నాపై ఎన్నో కేసులు పెట్టారు. మేము తప్పు చేస్తే ఏ జైలుకైనా వెళ్లడానికి సిద్ధం. వ్యవస్థలను బ్లాక్‌మెయిట్ చేసే నైజం నీది. ఈ ప్రభుత్వంలో ఎవరిపైనా కక్షసాధింపులు ఉండవు. మీ అవినీతికి సంబంధించిన ఆధారాలు చాలా ఉన్నాయి. అవన్నీ చట్టం చూసుకుంటుంది. ఇకనైనా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకో. నువ్వు తప్పు చేయలేదంటే ఎవరూ నిన్ను టచ్ చేయరు. నువ్వెంత అవినీతి చేశారో అందరికీ తెలుసు. అరెస్టయితే సింపతీ వస్తుందని అనుకుంటున్నావేమో? అలాంటి పరిస్థితి ఉండదు' అని పులివర్తి నాని స్పష్టంచేశారు. బియ్యం మాఫియాలో మీ కుటుంబానికి ఎంత ముడుపులు చేరాయో త్వరలోనే బయటకు వస్తుందని చెవిరెడ్డిని ఉద్దేశించి అన్నారు. ఎన్నికల సమయంలో కంటైనర్లలో డబ్బులు దొరికిన విషయాన్ని గుర్తు చేశారు.ఆ డబ్బులు తమవి కాదంటూ చెవిరెడ్డి బుకాయిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవద్దని, అవసరమైతే సలహాలు ఇవ్వాలని సూచించారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాది కాలంలో తాను ఎన్నో అభివృద్ధి పనులు చేపడితే.. చేయలేదంటూ పత్రికల్లో రాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.80కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశానని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు ఈశ్వర్‌రెడ్డి, గౌస్ బాషా, మురళి తదితరులు పాల్గొన్నారు.

మద్యం మాఫియాలో నన్ను ఇరికించే కుట్ర

- తప్పుడు వాంగ్మూలం కోసం సిట్ ఒత్తిడి తెస్తోందన్న చెవిరెడ్డి



తిరుపతి రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో తనను ఇరికించేందుకు కుట్ర చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాదులో నివాసమున్న తన ఆత్మీయుడు వెంకటేష్, ఆయన భార్య, ఏడాది వయసున్న కుమారుడిని సిట్ అధికారులు తమ కార్యాలయంలో బంధించి భయపెడుతున్నారని ఆరోపించారు. సిట్ తయారు చేసిన తప్పుడు స్టేట్‌మెంట్‌లో సంతకం పెట్టకుంటే ఏదో ఒక కేసులో ఇరికించి జీవితాంతం జైల్లో ఉండేలా చేస్తానంటూ వెంకటేష్‌ని ఏఎస్పీ శ్రీనివాస్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. అప్పటికీ ఆయన సంతకం పెట్టకపోవడంతో ప్రలోభపెడుతున్నట్లు ఆరోపించారు. వెంకటేష్ కుటుంబీకులతో పాటు ఆయనవద్ద పనిచేసే చిన్న చిన్న ఉద్యోగులనూ తీసుకెళ్లి హింసిస్తున్నారన్నారు.



గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు

వైభవం.. గోవిందుడి గరుడోత్సవం







తిరుమల ఆలయం నుంచి తీసుకొచ్చిన ఆభరణాలు - పల్లకి వాహనం

తిరుపతి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఐదో రోజైన శుక్రవారం రాత్రి గరుడసేవ జరిగింది. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన గరుడసేవ 10 గంటల వరకు కొనసాగింది. వజ్ర, వైఢూర్యాలు, విలువైన బంగారు ఆభరణాలు, సహస్రకాసుల హారాలు, నూతనంగా అందజేసిన నగలతో స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. గోవిందనామ స్మరణలతో అడుగడుగున భక్తజనం కర్పూర నీరాజనం సమర్పించారు. ఉదయం మోహినీ అవతారంలో స్వామివారు భక్తులను మురిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. వాహన సేవల ముందు కోలాటాలు, చెక్కభజనలు, కేరళాడ్రమ్స్, కళా బృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గరుడసేవ సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయం నుంచి రూ.34.46లక్షల విలువచేసే మూడు బంగారు ఆభరణాలను కానుకగా అందించారు. దీర్ఘచతుర ప్రాకార పతకం, అమ్మవార్ల దీర్ఘచతుర ప్రాకార రెండు పతకాలను శాశ్వత ప్రాతిపదికన టీటీడీ బహూకరించింది. తిరుమల బేడిఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈ ఆభరణాలను ఊరేగింపుగా డిప్యూటీ ఈవో లోకనాథం తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో జియ్యంగార్లు, అధికారులు పాల్గొన్నారు.

హెచ్చరికా.. మాకేంటి?

- బోర్డు పీకేసి భూమిని కొట్టేసేందుకు భారీ స్కెచ్

'ఈ భూమి కొత్తపాలెం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు-99లో ఉంది. ఇది ప్రభుత్వ భూమి. ఇందులోకి ప్రవేశించుట నిషిద్ధం. అట్లు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- రేణిగుంట తహసీల్దారు పేరిట ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఇది. దీనిని పీకి పడేసి ఆక్రమణకు యత్నిస్తున్నారు.



పాత విమానాశ్రయం రోడ్డులో కబ్జాకు యత్నిస్తున్న భూమి





ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ నిర్మించేందుకు తోలిన రాయి - రెవెన్యూ హెచ్చరిక బోర్డును పడేసిన దృశ్యం

రేణిగుంట మండలం పాత విమానాశ్రయం ఆనుకొని ఆరు లేన్ల జాతీయ రహదారి రావడంతో రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కళ్లు పడింది. దీంతో కోట్ల విలువైన ఆ భూములను ఆక్రమించేందుకు రెండు వర్గాలు దిగాయి. ఒక వర్గం ఆ భూమి తమదంటే, కడప జిల్లాకు చెందిన మరో వర్గం తమదంటున్నాయి. తమకంటే తమకు డాక్యుమెంట్లు ఉన్నాయని చెబుతున్నారు. ఆలస్యంగా మేలుకున్న రెవెన్యూ అధికారులు సదరు భూమిలో హెచ్చరికలు బోర్డు పెట్టారు. అయితే కొత్తపాళేనికి చెందిన వ్యక్తి ఐదు ఎకరాల భూమిలో సాగు చేసుకుంటామని గతంలో అసిస్టెంట్ సెటిల్మెంట్ ఆఫీసర్ దగ్గర దరఖాస్తు చేసుకున్నారు. విమానాశ్రయం సమీపంలో ఉండడంతో దరఖాస్తును రద్దు చేశారు. దీంతో ఈ భూమిలో సాగు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్, ఆర్డీవో సహా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుమతులు ఇవ్వలేదు. ఈ భూమి వద్దకు రోజుకు ఒకరు వచ్చి పోతుండడంతో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌బాబుని వివరణ కోరగా ప్రభుత్వ భూమిని శుభ్రం చేయడంతో మూడుసార్లు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అయితే మూడుసార్లూ దాన్ని తొలగించారన్నారు. ఇకపై ఎవరైనా భూమిలో ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

పారిశ్రామిక అవసరాలకు స్టాండ్‌రీచ్ ప్యానల్స్

- ఈ ప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ట్ పరిశ్రమ సీఈవో సంజాయ్ సింగానియా



రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న పరిశ్రమ సీఈవో సంజాయ్ సింగానియా తదితరులు

తడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక మౌలిక సదుపాయాలకు అవసరమయ్యే స్టాండ్‌రీచ్ ప్యానల్స్‌ను తయారు చేస్తున్నామని ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఎండీ, సీఈవో సంజాయ్ సింగానియా అన్నారు. తడ మండలం మాంబట్టు సెజ్‌లో సుమారు రూ.300 కోట్లతో ఏర్పాటు చేసిన ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ లిమిటెడ్ పరిశ్రమను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక ఫుడ్ ప్రాసెసింగ్ కోల్డ్ స్టోరేజ్ వంటి వాటికి అవసరమైన స్టాండ్‌రీచ్ ప్యానల్స్ పెరుగుతున్న డిమాండ్‌కు తమ పరిశ్రమ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. తమ పరిశ్రమ ద్వారా ఏడాదికి 8 లక్షల చదరపు మీటర్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉందని దానిని 13.10 లక్షల చదరపు మీటర్లకు చేర్చేలా తమ పరిశ్రమ పనిచేస్తుందన్నారు. దేశంలోనే పర్యావరణ హిత నిర్మాణ పరిష్కారాలకు తమ ఉత్పత్తులు ఎంతో మెరుగైనవని చెప్పారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రస్తుతం 730 మందికి.. మరి కొద్ది రోజుల్లోనే 900 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. 2023లో తమ పరిశ్రమ 1.51 లక్షల చదరపు అడుగుల నిర్మాణాన్ని 50 గంటల్లోనే పూర్తిచేసి గిన్నిస్ బుక్‌ఆఫ్ రికార్డు సాధించిందన్నారు. తమ పరిశ్రమకు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చట్టాలకు అనుగుణంగా అన్ని అనుమతులతో అత్యంత నాణ్యతతో ప్యానల్స్‌ను ఉత్పత్తి చేస్తామని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ చైర్మన్ భజరంగ్‌బోత్ర, ఈడీ నిఖిల్ బోత్ర, పీఆర్వో అజామ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి ఐఐటీలో జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు అవగాహన

ఏర్పేడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025లో అర్హత పొందిన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు క్యాంపస్‌లోని లెక్చర్ హాల్ కాంప్లెక్స్‌లో ప్రారంభమవుతుంది. డైరెక్టర్, డీన్లు, విభాగాధిపతులతో అభ్యర్థులు ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశం కల్పించారు. తరువాత క్యాంపస్ విజిట్ ఉంటుంది. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంలు, డబుల్ డిగ్రీలు, బ్రాంచ్ మార్పు విధానం, హాస్టల్ వసతి, వైద్య సౌకర్యాలు తదితరాలపై అవగాహన పొందవచ్చు. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌ద్వారా హాజరయ్యే అవకాశం ఉంది. వివరాలకు నెం. 0877-2503532లో సంప్రదించవచ్చు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్

24 గ్రాముల బంగారు స్వాధీనం



సీఐ సంగమేశ్వరావు, ఎస్ఐ అజయ్ కుమార్

దొరవారిసత్రం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు చేసి, రూ.2.20 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను, రూ.వెయ్యి నగదును స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు తెలిపారు. సూళ్లూరుపేట పట్టణం సూళ్లూరుకు చెందిన దారా ప్రసన్నకుమార్, దొవారిసత్రం మండలం శ్రీధనమల్లి గ్రామానికి చెందిన డమాయి ప్రశాంత్, సూళ్లూరుకు చెందిన కిషోర్‌తో కలిసి సూళ్లూరుపేట, దొరవారిసత్రం, ఓజిలి, చిల్లకూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడినట్లు సీఐ వివరించారు. వీరిపై సూళ్లూపేట స్టేషన్ పరిధిలో 13, దొరవారిసత్రంలో మూడు కేసులు కేసులు నమోదై ఉన్నాయన్నారు. శుక్రవారం దొరవారిసత్రం మండలం టపాయిండ్లు వద్దనున్న టోల్‌ప్లాజా సమీపంలో దారా ప్రసన్నకుమార్, డమాయి ప్రశాంత్‌ను అరెస్ట్ చేసి, రూ.2.20 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులను సూళ్లూరుపేట కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన ఎస్ఐ అజయ్ కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.

అట్టపెట్టెల కంటైనర్ దగ్ధం

అగ్నికి ఆహుతైన రూ.1.80 లక్షల థర్మాకోల్



దగ్ధమవుతున్న థర్మాకోల్ అట్టపెట్టెల కంటైనర్

తడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): థర్మాకోల్ అట్టపెట్టెలను రవాణా చేస్తున్న కంటైనర్ లారీ అగ్ని కీలల్లో చిక్కుకుంది. సత్యవేడు వద్ద ఉన్న ఓ థర్మాకోల్ పరిశ్రమ నుంచి శ్రీసిటీ సెజ్‌లోని ఒక ఏసీల పరిశ్రమకు శుక్రవారం కంటైనర్ లారీలో థర్మాకోల్ అట్టపెట్టెలను తరలిస్తున్నారు. తడ పోలీసుస్టేషన్‌కు సమీపంలో వెళ్తుండగా కంటైనర్‌లో నుంచి నుంచి పొగలు వస్తుండటంతో స్థానికులు గుర్తించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. వెంటనే డ్రైవర్ ఎదురుగా ఉన్న పోలీస్‌స్టేషన్‌లో చెప్పడంతో పోలీసులు కంటైనర్ తలుపులను తెరచి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. మంటలు ఎగిసి పడుతుండటంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను అదుపు చేసింది. సుమారు రూ.1.80 లక్షల విలువైన థర్మాకోల్ అట్టపెట్టెలు పూర్తిగా కాలిపోయాయని లారీ డ్రైవర్ తెలిపారు.

ఎన్డీసీఎంఎస్‌ను లాభాల బాటలో నడుపుతాం

చైర్మన్ నాగేశ్వరరావు



సమావేశంలో గంగోటి నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే కురుగొండ్ల, మెట్టుకూరు ధనుంజయరెడ్డి తదితరులు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీని(ఎన్డీసీఎంఎస్) లాభాల బాటలో నడుపుతామని ఆ సంస్థ చైర్మన్ గంగోటి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని ఎన్‌డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డీసీఎంఎస్‌ను లాభాల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, జిల్లా రైతాంగానికి ఇతోధికంగా సేవలు అందిస్తామని చెప్పారు. నాగేశ్వరరావు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, కన్నబాబు, ఎన్డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీసీసీబీ చైర్మన్‌గా ధనుంజయరెడ్డి

నెల్లూరు(హరనాథపురం): కేంద్ర సహకార బ్యాంకు (ఎన్డీసీసీబీ) చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్డీసీసీబీ నుంచి రైతులకు విరివిగా రుణాలు అందించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే బ్యాంకు వాటా మూలధనంపై ఖాతాదారులకు, రైతులకు డివిడెంట్ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాయ్ రీజనల్ మేనేజర్ భిక్షం

గూడూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం టెలికాం అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఆధ్వర్యంలో అవుట్‌రిచ్ కార్యక్రమం నిర్వహించారు. ట్రాయ్ హైదరాబాదు రీజనల్ మేనేజర్ భిక్షం మాట్లాడుతూ టెలికాం రంగంలో అనేక సాంకేతిక మార్పులు వస్తున్నాయని, ఎప్పటికప్పుడు నూతన పరిజ్ఞానంతో వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం 5జీ టెక్నాలజీతో సేవలు అందిస్తున్నామని, త్వరలోనే 6జీ సేవలను తీసుకువచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. విద్యార్థులు సైబర్ మోసాలకు గురికాకుండా అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, హేమంత్, సురేష్‌బాబు, ప్రవీణ్‌కుమార్, నీరజ, దత్తాత్రేయశర్మ, విశ్వక్సేనా రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యానగర్‌లో ఇంటర్వ్యూలు

కోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, కొత్తపాళెం రోడ్డులో గల శ్రీనివాస ఇంగ్లీషు మీడియం పాఠశాలలో నిరుద్యోగ యువతీ, యువకులకు పలు కంపెనీల్లో ఉపాధి కల్పించేందుకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అన్‌దిన్ చూడగల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి భూపతి మోహన్‌బాయి శుక్రవారం తెలిపారు. చెన్నైలోని ఐమేచ్యూ సొల్యూషన్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9494144302 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా రైల్వే ఫీడర్స్ పరిధిలో సూళ్లూరు, నాగరాజపురం, పొట్టి శ్రీరాములువీధి, ఇందిరానగర్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ మోహిని తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని అట్టకానితిప్ప సబ్‌స్టేషన్ పరిధిలో కొరిడి - పేర్నాడు, వేనాడు, కుదిరి గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరా ఉండదని లైన్ ఇన్‌స్పెక్టర్ రఫీ తెలిపారు.

అదుపుతప్పి లారీ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు



నాయుడుపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి క్రాస్ రోడ్డు సమీపంలో లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కర్ణాటక నుంచి మిరపకాయల లోడ్‌తో నెల్లూరు వెళ్తున్న లారీ అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాజేష్‌కు గాయాలవడంతో 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వా స్పత్రికి తరలించారు. అదే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు.

రెండు లారీల ఢీ

నాయుడుపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. కోలార్ నుంచి కూరగాయాల లోడ్‌తో నెల్లూరు వెళ్తున్న మినీ లారీ అయ్యప్ప రెడ్డిపాళెం సమీపంలో ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.





గూడూరులోని ఏరియా ఆస్పత్రి - నాలుగేళ్లుగా నిర్మాణంలో ఉన్న భవనం

నాడు 100... నేడు 50

- ఏరియా ఆస్పత్రిలో తగ్గిన పడకల సంఖ్య
- నత్తనడకన అభివృద్ధి పనులు
- అరకొర వసతుల నడుమ వైద్యసేవలు

గూడూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం కొవిడ్ భూతం ప్రపంచాన్ని గడగడలాడించింది. ఆధునిక వైద్యం ఎంత వృద్ధి చెందినా కరోనా వైరస్ దెబ్బకు లక్షలాది మంది పిట్టల్లా రాలిపోయారు. ఇప్పుడిప్పుడే ఆ మహమ్మారి నుంచి తేరుకుంటున్న సమయంలో మళ్లీ కొవిడ్ కేసులు నమోదవడం భయాందోళన రేకెత్తిస్తోంది. తాజాగా గురువారం నాడు గూడూరుకు చెందిన వ్యక్తికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో కలకలం రేగుతోంది. ఈ నేపథ్యంలో గూడూరు ఏరియా ఆస్పత్రిలో వైద్య సదుపాయాల లేమి ఆందోళనకు గురిచేస్తోంది. నాలుగేళ్ల క్రితం కొవిడ్ సమయంలో గూడూరు ఏరియా ఆస్పత్రిలో 100 పడకలు ఉండేవి. జనరల్ బ్లాక్‌లోని అత్యవసర విభాగంతో పాటు ఆరు వార్డులు, ప్రత్యేక గదుల్లో 70 పడకలు, అలాగే సీమాంక్ బ్లాక్‌లో 30 పడకలు గర్భిణులు, బాలింతల కోసం అందుబాటులో ఉండేవి. ఇందులో జనరల్ బ్లాక్‌లోని 70 పడకలను కొవిడ్ బాధితుల చికిత్సకు కేటాయించి వైద్య సేవలు అందించారు. ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేయడంతో పాటు, ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయాలు కల్పించి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో తగిన పడకలతో పాటు సౌకర్యాలూ లేవు.

అందుబాటులో ఉన్నవి 50 పడకలే

నాడు - నేడు పథకం ద్వారా ఏరియా ఆస్పత్రిని అభివృద్ధి పరిచేందుకు నాబార్డు నిధులు రూ.21 కోట్లతో 2020 అక్టోబరులో పనులు ప్రారంభించారు. 2022 జనవరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని నిర్దేశించారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలోని పాత భవనాలను తొలగించి వాటి స్థానంలో నూతన నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అయితే పనులు నత్తనడకన సాగుతుండడంతో నేటికీ పూర్తి కాలేదు. పాత భవనాన్ని కూల్చివేయడంతో అత్యవసర విభాగంలో 6, వార్డుల్లో 14 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక సీటీ స్కాన్, ఏఆర్‌టీ, ఐసీటీసీ, హోమియోపతి, బ్లడ్ బ్యాంక్‌లను అరకొర వసతుల నడుమ స్టాఫ్ క్వార్టర్స్ గదుల్లో నిర్వహిస్తున్నారు. సీమాంక్ సెంటర్‌లోని ఒక గదిల్లో అత్యవసరమైన ఆపరేషన్లు చేస్తున్నారు. ఇలా చాలీచాలని గదుల్లో ఉన్న వసతులను ఉపయోగించుకుని వైద్యసేవలు అందించాల్సి వస్తోంది.



నిరుపయోగంగా ఉన్న ఆక్సిజన్ ప్లాంటు

శిథిలావస్థలో ఆక్సిజన్ ప్లాంట్

కొవిడ్ సమయంలో ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది. 2021 డిసెంబరు 31న 1000 ఎల్‌పీఎమ్ కెపాసిటీతో గాలి నుంచి అధిక స్వచ్ఛత కలిగిన ఆక్సిజన్‌ను స్వీకరించే (ప్రెజర్ స్వింగ్ అడ్‌సోరేషన్) పీఎస్‌ఏ ప్లాంట్‌ను ప్రారంభించారు. అయితే దానిని వినియోగించునే సదుపాయాలు లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. కొవిడ్ కేసుల ఉధృతి పెరగక మునుపే కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని గూడూరు ఏరియా ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణం పూర్తయ్యేలా చూసి వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పేదల ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లలో నాణ్యత పాటించేలా హౌసింగ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు సక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. నాణ్యమైన ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇవ్వడం జరిగిందని, కొంతమంది కాంట్రాక్టర్లు ఆ నగదును డ్రా చేసుకుని పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా రూ.50వేలు మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు దగ్గరుండి నిర్మాణాలను పూర్తి చేయించుకోవాలన్నారు. అక్రమాలకు పాల్పడే కాంట్రాక్టర్లు, హౌసింగ్ ఉద్యోగులపై చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అనంతరం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.61 లక్షల చెక్కులను 6 మందికి అందజేశారు. అలాగే ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, చంద్రమౌళి, ఇశ్రాయిల్ కుమార్, సోమిశెట్టి చెంచురామయ్య, పెంచలయ్య, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

గూడూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళశాలలో శుక్రవారం డీఎస్సీ పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి 5గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

మానవత్వం చాటుకున్న మహిళా వీఆర్వో



వృద్ధుడికి తాగునీరు, భోజనం అందిస్తున్న వీఆర్వో గౌతమి

కోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని బీసీ గురుకుల పాఠశాల సమీపంలో శుక్రవారం ఓ అనాథ వృద్ధుడిపై మహిళా వీఆర్వో మానవత్వం చూపి స్థానికుల ప్రసంశలు అందుకుంది. క్రాస్ రోడ్డు నుంచి కోట పట్టణంలోకి వెళ్లే మార్గంలో బీసీ గురుకుల పాఠశాల ఆర్అండ్‌బీ రోడ్డు వద్ద వారం రోజులుగా 70 సంవత్సరాల వృద్ధుడు కాళ్లు ఈడ్చుకుంటూ రోడ్డుకు అటు ఇటూ తిరుగుతుండేవాడు. అతని పరిస్థితి గమనించిన స్థానికులు అన్నంపెట్టి ఆకలి తీర్చేవారు. రెండు రోజులుగా ఎవరూ అన్నం పెట్టకపోవడంతో రోడ్డుపై కూర్చొని ఆకలి అంటూ కన్పించిన ప్రతి ఒక్కరినీ ప్రాధేయపడుతుండేవాడు. చెందోడు వీఆర్వో గౌతమి ద్విచక్ర వాహనంలో తహసీల్దారు కార్యాలయానికి వెళ్తూ ఆ వృద్ధుడిని గుర్తించి ఆగింది. వివరాలు అడిగితే ఆయన సక్రమంగా చెప్పలేదు. ఆకలి అనడంతో హోటల్ నుంచి భోజనం, మజ్జిగ, నీళ్లు తెప్పించి ఇచ్చింది. అక్కడే ఉన్న ఓ రొయ్యల వ్యాపారి శ్రీనివాసులురెడ్డి ఆ వృద్ధుడికి దుస్తులు అందజేశారు. ఆస్పత్రిలో చేర్పించే ప్రయత్నం చేయగా ఆ వృద్ధుడు నిరాకరించడంతో మూడుపూటల భోజనం అందిస్తామని చెప్పారు. వీఆర్వో గౌతమిని స్థానికులు ప్రసంశించారు.

అడవి పందిని తప్పించబోయి చెట్టును ఢీకొన్న అంబులెన్స్



సూళ్లూరుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అట్టకానితిప్ప శ్రీహరికోట మార్గంలో శుక్రవారం షార్‌కు చెందిన అంబులెన్స్ చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ రణదీప్, వెంకటేష్‌కు గాయాలయ్యాయి. షార్ ఆస్పత్రి అంబులెన్స్ శ్రీహరికోట నుంచి సూళ్లూరుపేటకు వెళ్తుండగా అట్టకానితిప్ప మార్గంలో రోడ్డుపై అడవి పంది అకస్మాత్తుగా అడ్డువచ్చింది. దానికి తప్పించబోయిన అంబులెన్స్ అదుపుతప్పి దూసుకెళ్లి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలు కాగా, అంబులెన్స్ ముందుభాగం దెబ్బతింది. క్షతగాత్రులను వాహనంలోనే శ్రీహరికోట ఆస్పత్రికి వైద్యశాలకు తరలించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణం



గురుడ పటానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గరుడ పటానికి పూజలు నిర్వహించి ధ్వజారోహణం జరిపారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, భేరీపూజ, నవకుంభారోపణం పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని శేషవాహనంపై అలంకరించి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గూడలి సర్పంచు అదృశ్యం

కోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి సర్పంచు ఉడపల ఆదెమ్మ రెండు రోజులుగా కనిపించడం లేదని ఆమె భర్త పోలయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులక్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆదెమ్మ తిరిగి రాలేదని, బంధువులు, చుట్టుపక్కల విచారించినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదని చెప్పారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ

డక్కిలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే దోమల నివారణ సాధ్యమవుతుందని స్థానిక వైద్యాధికారి బిందు ప్రియాంక అన్నారు. శుక్రవారం డక్కిలిలోని బాలికల గురుకుల పాఠశాల, బీసీ సంక్షేమ శాఖ హాస్టల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. విద్యార్థులు తమ గదులు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచాలి

కోట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న భోజనంలో పోషక విలువలు పెంచాలని సీడీపీవో మునికుమారి అన్నారు. మండల పరిధిలోని తిమ్మానాయుడుపాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. చిన్నారుల బరువు, కొలతలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు.



తిమ్మానాయుడుపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీడీపీవో మునికుమారి

దర్గాగా రోడ్డు ఆక్రమణ

చోద్యం చూస్తున్న అధికారులు



ఆర్అండ్‌బీ రోడ్డును ఆక్రమించి బారికేడ్లు పెట్టిన దృశ్యం

సూళ్లూరుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురైంది. సాక్ష్యాత్తు ఆర్అండ్‌బీ బంగ్లా పక్కనే ఓ ప్రైవేట్ షాపింగ్‌మాల్ రోడ్డును ఆక్రమించుకొని సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టి పార్కింగ్ ప్రదేశంగా ఉపయోగించుకుంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు దాదాపు 15 అడుగుల మేర ఆక్రమణకు గురికావడంతో వాహనాలు కూడా పోలేని పరిస్థితి నెలకొంది. ఆక్రమించిన స్థలంలో నో పార్కింగ్ అంటూ పోలీసు బారీకేడ్లు పెట్టారు. కళ్లెదుటే రోడ్డు ఆక్రమణ జరుగుతున్నా కనబడుతున్న ఆర్అండ్‌బీ అధికారు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా ఆర్అండ్‌బీ బంగ్లా ఎదురుగా విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేందుకు మున్సిపాలిటీ అధికారులు డివైడర్‌ను తవ్వి వదిలేశారు. దీంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ప్రజా సంఘాల నాయకులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన అధికారుల్లో చలనం లేదు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డులో ఆక్రమణలను తొలిగించాల్సిన అవసరం ఉంది.


భూముల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు

పెళ్లకూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరు లోని సెజ్ భూములను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, కేంద్ర ఐఏఎస్ అధికారి, కంపెనీ ప్రతినిధులతో కలసి శుక్రవారం పరిశీలించారు. పాలచ్చూరు గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 6, 9, 416 లోని 22.49 ఎకరాల భూములను దమ్ము బయోఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించారు. ఇక్కడ విద్యుత్, రోడ్లు, నీరు తదితర సౌకర్యాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు కిషోర్‌బాబు, గ్రేస్‌రాజా, పెళ్లకూరు, నాయుడుపేట తహసీల్దార్లు ద్వారకనాథ్‌రెడ్డి, రాజేంద్ర, సర్వేయర్ సూర్య, వీఆర్వో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గృహోపకరణాల దగ్ధం



నాయుడుపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరిమిట్ట సమీపంలో ఓ ఇంట్లో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. రాజస్థాన్ నుంచి వచ్చి ఓ కుటుంబం పట్టణంలో పానీపూరి దుకాణాన్ని నిర్వహిస్తోంది. శుక్రవారం ఇంటి వద్ద వంటలు చేస్తుండగా గ్యాస్ లీక్ అయి మంటలు చేలరేగాయి. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

సచివాలయంలో తనిఖీలు

వాకాడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెమినీకొత్తపాళెం సచివాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వర్ రావు, ఉప సర్పంచు కిరణ్ కుమార్‌రెడ్డి ఉన్నారు.